
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న తొలి తెలంగాణ దినపత్రిక

APTEL/2011/39851

# సామాజిక తెలంగాణ

జాతీయ దినపత్రిక epaper.samajikatelangana.in

Published from Hyderabad | సంపుటి: 14 | సంచిక: 290 | మంగళవారం 16-06-2026 | ఎడిటర్: పి.వెంకటరమణ | పేజీలు: 12 | వెల రూ. 5/-

## అక్రిడేషన్ ప్రతి జర్నలిస్టు హక్కు



**బషీర్బాగ్/ హైదరాబాద్/ సామాజిక తెలంగాణ న్యూస్/ జూన్ 15**
మీడియా రంగంలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ ప్రభుత్వం కల్పించే హక్కని దానిని ఎవరు వదులుకోవాల్సిన అవసరం లేదని ఎస్టెన్ న్యూస్ ఛానల్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ పొదిల వెంకట్ అన్నారు.

ఆయన సోమవారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన కేబుల్ టీవీ జర్నలిస్టులకు అక్రిడేషన్ ఇవ్వాలి అనే అంశం పైన జరిగిన రౌండ్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ టీవీ రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని ఆయన అన్నారు. కేబుల్ టీవీ జర్నలిస్టులకు అక్రిడేషన్ కల్పించే విషయంలో అక్రిడేషన్ కమిటీ సభ్యులు కొన్ని అపోహాలతో అడ్డుకుంటున్నారని అది కరెక్ట్ కాదని నిజానికి కేబుల్ టీవీ రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులు సేకరించిన వార్తల ఆధారంగానే ప్రతి పల్లెలో సంపూర్ణ సమాచారం ప్రజలకు అందుతుందని అది ఇన్ఫర్మేషన్ డిపార్ట్మెంట్ గమనంలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.గత 30 సంవత్సరాలలో ఏనాడు కూడా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా అక్రిడేషన్ విషయంలో ఇంత రాద్ధాంతం జరగలేదని కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అక్రిడేషన్ విషయంలో కొంతమంది కావాలనే రకరకాల కొరువులు పెడుతూ అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కేబుల్ టీవీ రంగాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అందరూ అక్రిడేషన్ రానట్లయితే పోరాటం ద్వారానే సాధించుకోవాలని అది మన జన్మ హక్కుగా భావించి ఉద్యమ కార్యాచరణ ప్రకటించుకోవాలని వెంకట్ జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.

## ప్రతి కేబుల్ టీవీ జర్నలిస్టుకు
# అక్రిడేషన్ ఇవ్వాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

**హైదరాబాద్/ బషీబాగ్/ సామాజిక తెలంగాణ న్యూస్/ జూన్ 15**
కేబుల్ టీవీ రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని పలువురు జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. కేబుల్ టీవీ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, రంగ సమస్యల పరిష్కారంపై సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. సమావేశానికి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జేఏసీ ముఖ్య సలహాదారు పాశం యాదగిరి, టీజేఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అనంచిన్ని వెంకటేశ్వరరావు, ఏడబ్ల్యూజేఏ జాతీయ అధ్యక్షుడు కే. కోటేశ్వరరావు, ఎంఎస్‌వో ప్రతినిధి కోలా కిషోర్ గౌడ్ హాజరయ్యారు. డిజిటల్ మీడియా విస్తరణతో కేబుల్ టీవీ జర్నలిస్టుల పాత్ర మరింత పెరిగిందని, అయితే వారికి తగిన గుర్తింపు, సంక్షేమ పథకాలు, అక్రిడిటేషన్ సౌకర్యాలు

-మిగతా 2 లో



# ఇరాన్, అమెరికా మధ్య సీజ్ ఫైర్




### నాలుగు నెలపాటు కొనసాగిన వార్

- 14 అంశాలతో కూడిన శాంతి ఒప్పందంపై 19 సంతకాలు
- పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తిత్వంతో కుదిరిన డీల్
- స్విట్జర్లాండ్ వేదికగా సంతకాలు చేస్తామన్న అమెరికా, ఇరాన్
- ట్రంప్ ప్రకటనతో వెంటనే తెరచుకున్న హార్ముజ్ జలసంధి
- ఇంజన్లు స్టార్ట్ చేయండి.. ఆయిల్ కంపెనీలకు ట్రంప్ పిలుపు
- యుద్ధం ముగియడంతో ఆయిల్ ధర భారీగా పతనం

2 లో

ప్రపంచ దేశాలను నాలుగు నెలలుగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న అమెరికా, ఇరాన్ యుద్ధానికి బ్రేక్ పడింది. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, పాకిస్థాన్ ప్రధాని మెహబాజ్ విడివిడిగా అధికారికంగా ధృవీకరించారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించాలని, యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని ఈ డీల్ ఎంతో సహాయపడుతుందని ట్రంప్ తన బ్రైట్ నోట్ ద్వారా వెల్లడించారు. ఈ నెల 19న స్విట్జర్లాండ్ వేదికగా ఈ చారిత్రాత్మక ఒప్పందం అధికారికంగా సంతకాలు జరగనున్నాయి. - న్యూస్ డెస్క్, ఆంధ్రప్రభ



## తెలంగాణలో 19 నుంచి
# భారీ వర్షాలు

- ఉన్నతాధికారులు, కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సమీక్ష
- వాతావరణ హెచ్చరికలపై నిరంతర నిఘా ఉంచాలి
- విపత్తు నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధం
- భారీ వర్షాలు కురిసే ప్రాంతాలను ముందే గుర్తించండి
- ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే ప్రభుత్వ లక్ష్యం
- వర్షాకాలం ముగిసే వరకు రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం
- క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్,**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 19వ తేదీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలపై నిరంతర నిఘా అవసరమని వారికి స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా

-మిగతా 2 లో




## విదేశంలో.. వందేమాతరం

- స్లోవేకియా చేరుకున్న ప్రధాని మోదీ
- భారత దేశ గీతాలాపనతో స్వాగతం
- ఆ దేశ అధ్యక్షుడు పీటర్తో చర్చలు
- వాణిజ్యం, సాంకేతికతలో పరస్పర సహకారం
- ఎట్టుబడులే లక్ష్యంగా మోదీ, పీటర్ మధ్య చర్చలు
- ఎక్స్‌లో వివరాలు పోస్టు చేసిన ప్రధాని

**న్యూఢిల్లీ**
యూరప్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం స్లోవేకియా చేరుకున్నారు. మోదీ రాక సందర్భంగా అక్కడి మహిళలు ముక్తకంఠంతో వందేమాతరం గీతాన్ని ఆలపిస్తూ సాదరంగా స్వాగతించారు. ఆ దేశ అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినీతో మోదీ చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, సాంకేతికతలో పరస్పర సహకారం, పెట్టుబడులే లక్ష్యంగా మోదీ, పీటర్ నడుమ చర్చలు సాగనున్నాయి. కాగా, దేశ రాజధాని బ్రటిస్లావా చేరుకున్న మోదీ రెండు రోజుల బస చేయనున్నారు. తన పర్యటనతో భారత్ – స్లోవేకియా సంబంధాలు మెరుగుపడతాయని ప్రధాని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

-మిగతా 2 లో

## మెట్రో విస్తరణకు బీజేపీ, బీఆర్ఎస్
# అడ్డంకులు

### కేసీఆర్, కేటీఆర్‌ల డైరెక్షన్‌లోనే కిషన్‌రెడ్డి రాజకీయం!

- కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహకారం
- గుజరాత్, ఆంధ్రాకు నిధులిచ్చి.. హైదరాబాద్‌కు మొండిచేయి
- ఎల్ అండ్ టీ రుణ బదిలీని అడ్డుకున్న కిషన్‌రెడ్డి
- అభివృద్ధి జరిగితే పుట్టగతులుండవనే బీజేపీ భయం
- మెట్రో నిధులు తెస్తే కిషన్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానిస్తాం
- ఎన్నికల సాయానికి బీజేపీ చెల్లిస్తున్న 'గురుదక్షిణ'
- మోదీ హామీల అమలుపై చర్చకు రేవంత్ రెడ్డి సవాల్
- ప్రధాని సూచనలను కేంద్రమంత్రే తుంగలో తొక్కుతున్నారు!



హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్లక్ష్యం, రాజకీయ కారణాల వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని విమర్శించిన ఆయన, మెట్రో విస్తరణకు అవసరమైన నిధులు, అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణపై వివక్ష కొనసాగితే ప్రజల ముందే కేంద్రాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

2 లో

## తెలంగాణలో మ్రోగిన బడిగంటలు

- మళ్లీ రోడెక్కిన స్కూల్ బస్సులు, ఆటోలు
- విద్యార్థులకు ఉపాధ్యాయుల ఘన స్వాగతం
- తొలిరోజే ఉచిత పాఠ్యపుస్తకాలు, అల్పాహారం పంపిణీ
- హాజరు శాతంపై 'అమావాస్య' సెంటిమెంట్ ప్రభావం



**హైదరాబాద్,**
వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళ్లు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ రోడ్లపైకి వచ్చాయి. స్కూల్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి. తెలంగాణలో పాఠశాలలు తెరచుకోవడంతో తల్లిదండ్రులు మళ్లీ బిజీ అయ్యారు. కొత్త పుస్తకాలు..

-మిగతా 2 లో


# సీఎం విజయ్ బర్త్‌డే రోజున కొత్త రేషన్ కార్డుల పంపిణీ



**చెన్నై:-**
తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ తన పుట్టిన రోజున కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నారు. జూన్ 22వ తేదీన ఆయన జన్మదినోత్సవం జరుపుకోనున్నారు. అర్హులైన లబ్ధిదారులకు కొత్త తరహా రేషన్ కార్డులను అందివ్వనున్నారు. ఆహార, పౌర సరఫరాల శాఖ అధికారుల ప్రకారం.. ఇప్పటికే సుమారు 46 వేల కొత్త రేషన్ కార్డులను ప్రింట్ చేశారు. వాటిని పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి సుమారు 2.25 లక్షల మంది కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే తొలి దశలో 46 వేల మందికి కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. పెరంబదూర్‌లో జరిగిన బర్త్‌డే కార్యక్రమంలో సీఎం విజయ్ కొత్త రేషన్ కార్డులను డిస్ట్రిబ్యూట్ చేయనున్నారు. సీఎం బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించేందుకు టీవీకే భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

# పాకిస్థాన్‌లో కూలిన శిక్షణ విమానం..

## - ఇద్దరు పైలట్లు మృతి




**ఇస్లామాబాద్:-**
పాకిస్థాన్ వైమానిక దళాని కి చెందిన శిక్షణ విమానం కూలింది. ఖైబర్ ఫక్తున్‌క్వా ప్రావిన్సులోని మర్దాన్‌లో జరిగిన ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మృతిచెందారు. రొటీన్ ట్రైనింగ్ మిషన్‌లో భాగంగా జరిగిన ఫ్లయింగ్ సెషన్ విషాదానికి దారి తీసింది. మృతులను పాక్ వైమానిక దళానికి చెందిన ఫ్లయిట్ లెఫ్టినెంట్ మొమహ్మద్ ఖాసిమ్ అబ్దుల్లా, పాక్ నేవీకి చెందిన లెఫ్టినెంట్ తాహా అబ్బాస్ గా గుర్తించారు. ఈ ప్రమాదం పట్ల దర్యాప్తునకు ఆదేశించినట్లు వైమానిక దళం పేర్కొన్నది. పైలట్ మృతుల పట్ల ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీతో పాటు వివిధ దళాలకు చెందిన చీఫ్‌లు సంతాపం ప్రకటించారు. పైలట్ల మృతి పట్ల దేశాధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారి, ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా నివాళి అర్పించారు. వారం క్రితమే పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ-17 హెలికాప్టర్.. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ వద్ద సాంకేతిక లోపం వల్ల కూలిన విషయం తెలిసిందే. జూన్ 10వ తేదీన జరిగిన ఆ ఘటనలో 22 మంది సిబ్బంది మృతిచెందారు. ఆ ఘటన పట్ల కూడా దర్యాప్తునకు ఆదేశించారు. పాకిస్థాన్‌లో ఇటీల ఆ దేశ సైన్యానికి చెందిన హెలికాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు కూలాయి.

# తెలంగాణలో మ్రోగిన బడిగంటలు

మొదటి తరువాయి



ఏకరూప దుస్తులతో బడులకు వెళ్లే చిన్నారులతో సందడి నెలకొంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్తగా అల్పాహారాన్ని అందించనున్నారు. తొలి రోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న బుధవారం, 19న శుక్రవారం ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

# ఇరాన్, అమెరికా మధ్య సీజ్ ఫైర్

- 14 అంశాలతో కూడిన శాంతి ఒప్పందంపై 19 సంతకాలు
- పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తిత్వంతో కుదిరిన డీల్
- స్విట్జర్లాండ్ వేదికగా సంతకాలు చేస్తామన్న అమెరికా, ఇరాన్
- ట్రంప్ ప్రకటనతో వెంటనే తెరచుకున్న హార్ముజ్ జలసంధి
- ఇంజన్లు స్టార్ట్ చేయండి.. ఆయిల్ కంపెనీలకు ట్రంప్ పిలుపు
- యుద్ధం ముగియడంతో ఆయిల్ ధర భారీగా పతనం



న్యూఢిల్లీ

**పాకిస్థాన్, ఖతార్ మధ్యవర్తిత్వం**
ఈ సుదీర్ఘ యుద్ధాన్ని ఆపడానికి పొరుగు దేశాలైన పాకిస్థాన్, ఖతార్ కీలక మధ్యవర్తులుగా వ్యవహరించాయి. రెండు దేశాల ప్రధానులతో మాట్లాడి యుద్ధ విరామకు ఒప్పించాయి. ఈ డీల్ ప్రకారం లెబనాన్ ప్రాంతంతో సహా అన్ని వైపులా జరుగుతున్న సైనిక చర్యలను తక్షణమే, శాశ్వతంగా నిలిపివేయడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ప్రపంచ వాణిజ్య నీతి అత్యంత కీలకమైన స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ జల సంధిని అన్ని రకాల అంతరాయం లేకుండా 30 రోజుల్లోగా పూర్తిగా తెరిచేందుకు ఇరాన్ ఒప్పుకుంది. దీనికి బదులుగా ఇరాన్ ఒకేసారిపై విధించిన నాకాబందీని అమెరికా వెంటనే తొలగించింది.

**అంగీకారం కుదిరిన 14 ముఖ్యమైన అంశాలు**
ఇరాన్ అధికారిక వార్తా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. శాంతి ఒప్పందంలో 14 ప్రధానాంశాలపై ఇరు దేశాలు ఒక అంగీకారానికి వచ్చాయి. వాటి ప్రకారం.. యుద్ధాన్ని వెంటనే ముగించడం, ఇరాన్ అంతర్గత విషయంలో అమెరికా జోక్యం చేసుకోకపోవడం, ఇరాన్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవడం జరుగనుంది. అలాగే ఇరాన్ ఆయిల్ విక్రయాలపై ఉన్న ఆంక్షలను సడలించి, ఆ డబ్బును ఇరాన్ తిరిగి పొందేలా చూస్తారు. వీటితో పాటు యుద్ధంలో దెబ్బతిన్న ఇరాన్ పునర్నిర్మాణం కోసం అమెరికా, దాని మిత్రదేశాలు కలిసి దాదాపు 300 బిలియన్ డాలర్లు (సుమారు ?25 లక్షల కోట్లు) ఆర్థిక సహాయాన్ని అందించనున్నాయి. ఇరాన్ అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం తాము ఎప్పటికీ అణు ఆయుధాలను తయారు చేయబోమని హామీ ఇచ్చింది. అలాగే అమెరికా బ్యాంకుల ద్వారా ఫ్రీజ్ అయిన ఇరాన్కు చెందిన 24 బిలియన్ డాలర్ ఆస్తులను విడుదల చేస్తానని ఇరాన్కు హామీ ఇచ్చారు. చర్చలు జరుగుతున్న 60 రోజుల పాటు అమెరికా ఎలాంటి కొత్త ఆంక్షలు కానీ, సైనిక చర్యలు కానీ చేపట్టకూడదు. ఈ 14 అంశాలపై ప్రాథమిక అవగాహన కుదిరినప్పటికీ, కొన్ని కీలకమైన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాగానే మిగిలిపోయాయి. ముఖ్యంగా ఇరాన్ దగ్గర ఉన్న అత్యంత ప్రమాదకరమైన యురేనియం నిల్వలను పూర్తిగా నాశనం చేయాలని అమెరికా డిమాండ్ చేస్తోంది. అయితే.. ఇరాన్ మాత్రం ఆ యురేనియంను నాశనం చేయకుండా, తక్కువ సంధత కలిగిన రూపంలో తమ దేశంలోనే ఉంచుకోవడానికి అనుమతించాలని కోరుతోంది. ఈ విషయంలో ఇరు దేశాల మధ్య స్పష్టత రాలేదు. ఇరాన్ విదేశాంగ మంత్రి కాతేం గరీబాఖానీ మాట్లాడుతూ.. అమెరికా ఈ 60 రోజుల్లో తన వాగ్దానాలను ఎలా నిలబెట్టుకుంటుందో చూసిన తర్వాతే తాము తుది ఒప్పందంపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు.

**సంకతాల వేడుకకు డోనాల్డ్ ట్రంప్ వెళ్తారా?**
నిమిషంలో ఈ కార్యక్రమానికి వచ్చే ఛాన్స్ ఉందని సంకేతాలు ఇచ్చారు. కానీ భద్రతా కారణాల దృష్ట్యా, ఫ్రాన్స్‌లో జరగబోయే జీ7 సదస్సు షెడ్యూల్ కారణంగా దీనిపై ఇంకా పూర్తి నిర్ణయం తీసుకోలేదు. సాధారణంగా అమెరికా సెనేట్ సిబ్బంది నిబంధన ప్రకారం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఇద్దరూ ఒకేసారి విదేశీ పర్యటనలకు వెళ్ళకూడదు. కాబట్టి ట్రంప్ లేదా జెడి వెన్స్‌లలో ఎవరో ఒకరు మాత్రమే స్విట్జర్లాండ్ వెళ్లే అవకాశం ఉంది.
మరోవైపు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో ఈ ఒప్పందంపై స్పందించారు. ప్రపంచశాంతికి అత్యంత కీలకమైన హాట్ టాపిక్ అయిన ఇరాన్ తో తెరదించామని, ఆశించిన ఫలితం పూర్తిగా లభించిందని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌పై విధించిన ఎగుమతి వాణిజ్య దిగ్బంధనాన్ని పూర్తిగా తొలగిస్తున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ప్రపంచ దేశాలు వాణిజ్య ఉద్రేకం ఎడతెగలేదు.. అతి తక్కువ ఎందుకు? మీ పిడికిలి స్టార్ట్ చేయండి.. ఆయిల్ తెరకనిపించు మొదలుపెట్టండి అంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపు ఇప్పుడు గ్లోబల్ మార్కెట్‌లో జోష్ నింపింది.

**ఆయిల్ ధరలు పతనం..**
ఈ శాంతి ఒప్పందంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు అదుపులోకి వచ్చే అవకాశం ఉండున్నావని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. యుద్ధం ముగిసి, వాణిజ్య మార్గాల తెరుచుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా వ్యాపార వాణిజ్యాలు మళ్ళీ పుంజుకున్నాయి. కాగా, సోమవారం అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. దాదాపు 4 శాతం మేర తగ్గాయి. నిన్నటి వరకు 112 డాలర్లుగా ఉన్న బ్యారెల్ ధర ఒక్కసారిగా 84 డాలర్లకు పడిపోయింది.. రానున్న రోజుల్లో ధర మరింత తగ్గుతుందని భావిస్తున్నారు.

# మెట్రో విస్తరణకు బీజేపీ, బీఆర్ఎస్ అడ్డంకులు

- కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహకారం
- గుజరాత్, ఆంధ్రాకు నిధులిచ్చి.. హైదరాబాద్‌కు మొండిచేయి
- ఎల్ అండ్ టీ రుణ బదిలీని అడ్డుకున్న కిషన్‌రెడ్డి
- అభివృద్ధి జరిగితే పుట్టగతులుండవనే బీజేపీ భయం
- మెట్రో నిధులు తెస్తే కిషన్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానిస్తాం
- ఎన్నికల సాయానికి బీజేపీ చెల్లిస్తున్న 'గురుదక్షిణ'
- మోదీ హామీల అమలుపై చర్చకు రేవంత్ రెడ్డి సవాల్
- ప్రధాని సూచనలను కేంద్రమంత్రే తుంగలో తొక్కుతున్నారు!



హైదరాబాద్
మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్‌వోసి అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి ఎన్‌వోసి ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు. కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదన్నారు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# ఎపిలో పెట్టుబడులు పెట్టండి




అమరావతి
ఏపీకి 1,000 కి.మీ సుదీర్ఘ సముద్ర తీరం ఉందని.. లాజిస్టిక్స్ పరంగా అనేక అనుకూలతలు ఉన్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. హైవేలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వే కనెక్టివిటీ ఉందని సీఎం చెప్పారు. లాజిస్టిక్స్ వ్యయం తగ్గించేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. హార్టికల్చర్‌పై లక్ష కోట్లు ఇన్వెస్ట్ చేయబోతున్నామని.. ఆక్వాకల్చర్‌లో నంబర్ 1గా ఉన్నామని వివరించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా వివిధ ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు వరుసగా సమావేశాలు నిర్వహించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం వివరించారు. తొలిరోజు పర్యటనలో భాగంగా వైసీహెచ్ లాజిస్టిక్స్ గ్రూప్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ సునీల్ నంబియార్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. సప్లై చైన్, లాజిస్టిక్స్ పార్కుల ఏర్పాటుపై గ్రూప్‌తో చర్చలు జరిపారు. ఆటోమేటెడ్, అత్యాధునిక సాంకేతికతతో కూడిన భారీ సప్లై చైన్ సిటీని ఏపీలో నిర్మించే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ఆహార ఉత్పత్తులకు వాల్యూఎడిషన్ ద్వారా ఎగుమతులకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో అపార అవకాశాలు ఉన్నాయని... ప్రొడక్షన్‌లో కూడా పెట్టుబడులు పెట్టవచ్చన్నారు. 'ఏపీని సందర్శించండి... రాష్ట్రంలో ఉన్న పాలసీలు, అనుకూలతలు చూసి పెట్టుబడులు పెట్టండి' అంటూ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. గూగుల్ క్లౌడ్ ఆసియా-పసిఫిక్ రీజియన్ అధ్యక్షుడు కరణ్ బజ్వాతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద ఏఐ, డేటా సెంటర్, డిజిటల్ మౌలిక సదుపాయాల కేంద్రంగా తీర్చిదిద్దే అంశాలపై ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ రంగాల్లో గూగుల్ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగంపై గూగుల్ క్లౌడ్ సహకారాన్ని సీఎం కోరారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థను మరింత శక్తిమంతం చేసేందుకు ఆధునిక క్లౌడ్ సాంకేతికతల వినియోగంపై చర్చించారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ టెక్నాలజీలలో యువతకు భారీ స్థాయిలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రతిపాదించారు. గూగుల్ క్లౌడ్‌తో కలిసి ఏఐ స్కిల్లింగ్, క్లౌడ్ సర్టిఫికేషన్ కార్యక్రమాలను విస్తరించాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

# విదేశంలో.. వందేమాతరం

మొదటి తరువాయి

"రాజధాని బ్రటిస్లావా చేరుకున్నా. భారత్ – స్లోవేకియా మధ్య సంబంధాల బలోపేతానికి, కొత్త వ్యాపారాలు, సహకారం వంటివి సాధ్యపడేందుకు ఈ పర్యటన దోహదపడనుంది. అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినీ, ప్రధాని పికోతో ఫలవంత మైన చర్చలు జరపాలని భావిస్తున్నా" అని ప్రధాని ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించారు. స్లోవేకియాకు 1993లో స్వతంత్రం వచ్చాక ఆ దేశానికి వెళ్ళిన మొదటి భారత ప్రధాని మోదీనే కావడం విశేషం.

# తెలంగాణలో 19 నుంచి భారీ వర్షాలు

మొదటి తరువాయి

ఉండాలని సూచించారు. వర్షాల తీవ్రత పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని ఉన్నతాధికారులకు తెలిపారు. ప్రజల ప్రాణాలతోపాటు వారి ఆస్తుల రక్షణెళి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్షాకాలం ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రతి కేబుల్ టీవీ జర్నలిస్టుకు అక్రిడేషన్ ఇవ్వాలి

మొదటి తరువాయి

అందడం లేదని వక్తలు పేర్కొన్నారు. కేబుల్ టీవీ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులను కూడా ప్రధాన మీడియా ప్రతినిధులుగా గుర్తించి సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేబుల్ టీవీ రంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అతిథులు హామీ ఇచ్చారు. హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ జర్నలిస్టులు, నిర్వాహకులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. సమావేశంలో జేఏసీ కన్వీనర్లు బి. నరసింహచారి, భరత్‌కుమార్, డా. మహ్మద్ యాసిఫ్ పాషా, పొదిల వెంకట్, మహేష్‌కుమార్ ఉపాధ్యాయ, రాచర్ల గోపి, డా. బాను ప్రసాద్, పీట్ల ప్రతాప్, జితేందర్, శ్రీనివాస్, వేణుగోపాల్, కలీమ్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. సమావేశం కేబుల్ టీవీ జర్నలిస్టుల హక్కుల సాధనకు బలమైన వేదికగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్, డీఈవో

**-ఇందారం జడ్పీఎస్ఎస్ లో 202627 విద్యా సంవత్సరం ప్రారంభం.**






**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,జూన్ 15, (సామాజిక తెలంగాణ):**
ఇందారం గ్రామపంచాయతీ పరిధిలోని జడ్పీ ఎస్ఎస్ పాఠశాలలో సోమవారం 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అడిషనల్ కలెక్టర్ పి.చంద్రయ్య (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి మంచిర్యాల ముఖ్య అతిథులుగా హాజరై పాఠశాలను సందర్శించారు. అదనపు కలెక్టర్ పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంట గది, మరుగుదొడ్లు, లైబ్రరీ, స్పోర్ట్స్ రూమ్, డైనింగ్ హాల్, డిజిటల్ తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మమేకమై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి, విద్య యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా బడికి రావాలని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఫయాజుద్దీన్ మాట్లాడుతూ ఇందారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని, డ్రాప్ ఔట్లు లేకుండా చూసేందుకు వార్డు సభ్యులతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏళ్కటూరి శివ, ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ, మండల విద్యాధికారి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, జీపీవో శ్రీదేవి, ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వనాలు. పర్యావరణ పరిరక్షణకు వరాలు

**- మొక్కలు నాటడం సామాజిక బాధ్యత**
**- జిల్లాలో వనమహోత్సవ లక్ష్యం 31.95 లక్షల మొక్కలు.**
**- రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో నగర్ వన్ యోజన పార్కులో ఈనెల 18న వన మహోత్సవ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభం.**
**- జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలి.**
**- ప్రతి శాఖ లక్ష్యాలకు అనుగుణంగా మొక్కల నాటాలి**
**- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**
**-ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై అధికారులు. చిత్తశుద్ధితో వ్యవహరించాలి.**
**- ఆస్తి పన్ను వస్తువులలో కలెక్టరేట్ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు..**
**- కలెక్టరేట్ వివిధ శాఖల కార్యాలయాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలి.**
**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**






**మెదక్, జూన్ 15( సామాజిక తెలంగాణ):-**
వనాలు పర్యావరణ పరిరక్షణకు వరాలు అని మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా తీసుకొని ఈనెల 18వ తారీఖు నుండి వన మహోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించాలనిరామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో నగర్ వన్ యోజన పార్కులో ఈనెల 18న వన మహోత్సవ కార్యక్రమం లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ఆస్తి పన్ను వసూలలో కలెక్టరేట్ కార్యాలయ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్అధికారులను ఆదేశించారు .సోమవారం ప్రజావాణి అనంతరం వివిధ శాఖల అధికారులతో వనమహోత్సవ కార్యక్రమం, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, ఆస్తి పన్ను వసూలు , ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రత సంబంధిత విషయాల పై అదనపు కలెక్టర్ నగేష్ , డీఎఫ్ఓ జో.జి డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులందరూ తమ భాగస్వామ్యం ద్వారా విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించడానికి, పచ్చదనాన్ని పెంపొందించడానికి వన మహోత్సవం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఈనెల 18 నుండి వన మహోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వక్చువల్ గా ప్రారంభిస్తున్న నేపథ్యంలో మన జిల్లాలో కూడా ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ముందుకు పోతున్నామన్నారు. అటవీ శాఖ,జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మున్సిపల్ శాఖ, వివిధ సంక్షేమ శాఖలు వ్యవసాయ, విద్యా, తదితర శాఖల ఆధ్వర్యంలో మొత్తం 31.95 లక్షల మొక్కలను నాటేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని పరిరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాను మరింత పచ్చదనంతో నింపేందుకు అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ శాఖల వారీగా రివ్యూ చేస్తూ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆస్తి పన్ను వసూలలో భాగంగా కలెక్టరేట్ నిర్వహణ కమిటీల ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత డిఆర్ఓ ను ఆదేశించారు. కలెక్టరేట్ లోని వివిధ విభాగాలు పరిశుభ్రతకు నిలయాలుగా మారాలని కార్యాలయాలు కలెక్టర్ ఆకస్మిక పర్యటనలలో అపరిశుభ్రంగా ఉన్న కార్యాలయాల అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాయిన్పల్లి ప్రాజెక్టు మరమ్మతులు ఎప్పుడు చేస్తారు

**-రాయిన్పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ, లో లెవల్ దెబ్బతిన్న ధోనికి తాత్కాలిక మరమ్మతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు.**



**మెదక్ , జూన్ 15( సామాజిక తెలంగాణ):-**
రాయిన్పల్లి ప్రాజెక్టుహై లెవల్ కాల్వ, లో లెవల్ దెబ్బతిన్న ధోనికి తాత్కాలిక మరమ్మతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు సోమవారం మెదక్ కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడాది ఆగస్టులో కురిసిన భారీ వర్షాల కారణంగా మెదక్ మండలంలోని రాయిన్పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ, లో లెవల్ ధోని కొట్టుకుపోయిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2,500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ధోని దెబ్బతిని సంవత్సరం గడిచినా ప్రభుత్వం ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. రాయిన్పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ ధోనికి తక్షణమే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీటి సౌకర్యంకల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. రాయిన్పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ ద్వారా తిమ్మానగర్, మక్తా భూపతిపూర్, గుట్టకిందిపల్లి, శివాయిపల్లి, మల్కాపూర్ తండా, వెంకటాపూర్, కొంటూర్ గ్రామాల రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈ కాల్వ ద్వారా మెదక్ పట్టణ పరిధిలోని గోసముద్రం, పిట్లంబేస్, బంగ్లా చెరువులు కూడా నిండుతాయని వివరించారు. రాయిన్పల్లి ప్రాజెక్టు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు లావణ్య రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు బట్టి. జగపతి, కృష్ణారెడ్డి, మెదక్ మండల పార్టీ ఎంపీపీ అధ్యక్షులు అంజగౌడ్,మాజీ కిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ మార్గం. ఆంజనేయులు, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు మాయ మల్లేశం, ఆర్.కే. శ్రీనివాస్, బీమరి కిషోర్, బీఆర్ఎస్ నాయకులు వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈరోజు పున ప్రారంభమైన జిల్లా పరిషత్ బాలికల పాఠశాల

**-విద్యార్థులకు స్వాగతం పలికిన మండల విద్యాధికారి జింక మల్లేష్**



**జూన్ సామాజిక తెలంగాణ గోదావరిఖని న్యూస్**
గోదావరిఖని స్థానిక అశోక్ నగర్, లోని బాలికల పాఠశాల హెడ్మాస్టర్ మరియు మండల విద్యాధికారి జింక మల్లేష్ మాట్లాడుతూ బడిబాటలో భాగంగా ఈరోజు స్కూల్ ని పున ప్రారంభించడం జరిగినది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చక్కటి విద్యని అందిస్తూ విద్యార్థులందరికీ విద్యతో పాటు స్కూల్ పుస్తకాలు స్కూల్ యూనిఫామ్ మధ్యాహ్నం పౌష్టికాహారమైన భోజనం తోపాటు విద్యార్థుల కు ఉన్నతమైన విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు చక్కటి బాసట వేస్తున్న ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులు చేరాలని జింక మల్లేశం పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈరోజునుండి జూన్ 20 వరకు పలు కార్యక్రమాలు ఉంటాయని ఈ సందర్భంగా తెలియజేసినారు ఆయ. జూన్ 16వ తేదీన అక్షరాభ్యాస కార్యక్రమం కూడా ఉంటుందని మండల విద్యాధికారి పేర్కొనడం జరిగింది.

# విద్యుత్ షాక్తో రైతు మృతి



**కొల్చారం జూన్15( సామాజిక తెలంగాణ):-**
మెదక్ జిల్లాలో విషాదం చోటచేసుకుంది. కరెంట్ షాక్తో ఓ రైతు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన రైతు కురుమ పోచయ్య (50) సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలంలో కరెంట్ షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం ఉదయం తుకానికి నీళ్లు పెట్టడానికి పొలం వద్దకు వెళ్లగా తుకం మడి పక్కన ఉన్న సర్వీస్ వైరు తగలడంతో షాక్ కు గురై మరణించాడు. పోచయ్య మరణంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్.**







**మెదక్ , జూన్ 15( సామాజిక తెలంగాణ):-**
సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిద ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 82 దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించడానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. సమస్యలు పరుష్కారం కోరుతూ ప్రజలు అందచేసిన దరఖాస్తులు జాప్యం చేయకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు వ్యక్తి గతంగా పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. వచ్చే సోమవారం వరకు వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని, తద్వారా సమస్యల పరిష్కారం పట్ల పారదర్శకత నెలకొల్పాలని ఆదేశించారు. అదేవిధంగా, దరఖాస్తులు అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలను పోర్టల్లో నమోదు చేయాలని ఆదేశించారు.ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి


**- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు.**



**మెదక్, జూన్ 15 (సామాజిక తెలంగాణ):-** మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ప్రజల నుండి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి వాటిపై సమగ్రంగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, భూ వివాదాలు, మోసాలు, వేధింపులు మరియు ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, బాధితులకు న్యాయం జరిగే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా వ్యవహరించాలని, ప్రతి వినతిదారునికి ఫిర్యాదు పురోగతిపై సమాచారం అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి పారదర్శకమైన వ్యవస్థను అమలు చేయడం మెదక్ జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

## అధిక ఫీజులు నియంత్రించాలని మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేసిన

**-బిఆర్ఎస్ పార్టీ నాయకులు పున్నం శశికుమార్**



**జూన్ సామాజిక తెలంగాణ గోదావరి న్యూస్** విన BRS పార్టీ సీనియర్ నాయకులు కౌశిక హరిగారి ఆదేశాల మేరకు ఈ విద్య సంవత్సరం స్కూల్స్, కాలేజీ ఫీజులు, బుక్స్ అధిక ధరల నియంత్రణ చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికనష్టం కలవకుండా చూడాలని, రూల్స్ పాటించని విద్యాలయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రామగుండం మండల విద్యాధికారి జింక మల్లేష్ గారికి వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు పున్నాం శశికుమార్, సడవేని రాజు, ఉప్పు సాయికుమార్, లక్కాకుల మహేందర్, గొట్టే నరేష్, సంతోష్, శ్రీనివాస్, మురళి

## రాష్ట్ర స్థాయి 12వ తెలంగాణ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో మెరిసిన మెదక్ జిల్లా క్రీడాకారులు

**- క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**



**మెదక్, జూన్ 15( సామాజిక తెలంగాణ):-** ఈనెల 11,12 తేదీలలో హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం లో జరిగిన రాష్ట్రస్థాయి 12 వ తెలంగాణ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్ పోటీలలో మెదక్ జిల్లా నుండి పాల్గొని వివిధ క్రీడాంశాలలో పథకాలు సాధించిన మెదక్ జిల్లా క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ క్రీడాకారులు సాధించిన పథకాలను వారి మెడలో వేసి అభినందించారు. అథ్లెటిక్స్ క్రీడలలో పథకాలు సాధించిన అనిత 10 కిలోమీటర్ల పరుగు లో తృతీయ స్థానం, శేఖర్ 3000 మీటర్ల పరుగు లో ద్వితీయ స్థానం మరియు 400 మీటర్ల హార్డిల్స్ విభాగంలో ద్వితీయ స్థానం, అశోక్ మరియు రవి 4ఐ400 రిలే లో ద్వితీయ స్థానం సాధించడం జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలలో జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రమేష్ గంగాల, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనుముల మధుసూదన్, కోచ్ అర్జున్ పాల్గొన్నారు.

# రైతులకు ఉరితాడుగా మారిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

**-యాప్ పేరుతో అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గం..**
**-యాప్‌ను రద్దు చేసే వరకు రైతుల పక్షాన**
**-పోరాటం కొనసాగిస్తాం..**
**-నిజామాబాద్ బీఆర్ఎస్ జిల్లా తాజా,మాజీ అధ్యక్షులు,ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి..**






**ఆర్మూర్,జూన్ 15 (సామాజిక తెలంగాణ):** రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తూ, వ్యవసాయాన్ని కుంటుపరిచేలా ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా మొబైల్ యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండల కేంద్రంలో రైతులు చేపట్టిన భారీ ధర్నాలో నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ తాజా మాజీ అధ్యక్షులు,ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశన్నగారి జీవన్ రెడ్డి మాట్లాడుతూ, సాంకేతికత పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ రైతులకు ఉపయోగపడటం కన్నా ఇబ్బందులు సృష్టిస్తోందని మండిపడ్డారు.గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు,స్మార్ట్‌ఫోన్‌లు లేని రైతుల పరిస్థితిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. యాప్ ద్వారా యూరియా పంపిణీ చేయడం వల్ల రైతులు ఎరువుల కోసం రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని సులభతరం చేయాల్సిన ప్రభుత్వం తుగ్లక్ నిర్ణయాలతో రైతులపై అదనపు భారాన్ని మోపుతోందని విమర్శించారు. రైతులకు సకాలంలో ఎరువులు అందక పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. యూరియా యాప్ కారణంగా బ్లాక్ మార్కెట్ పెరిగే ప్రమాదం ఉందని,రైతులు ప్రైవేట్ వ్యాపారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ రైతాంగానికి ఎరువుల కొరత రాకుండా చర్యలు తీసుకున్నారని,కానీ నేడు రైతులు ఎరువుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మునుపటిలాగే గుర్తింపు కార్డుల ఆధారంగా నేరుగా ఎరువులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నందిపేట్ మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా సరిపడా యూరియా,ఇతర ఎరువుల నిల్వలను ప్రభుత్వం వెంటనే అందుబాటులో ఉంచాలని కోరారు. రైతులకు శాపంగా మారిన యూరియా యాప్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని,లేనిపక్షంలో రైతాంగంతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ జడ్పి ఛైర్మన్ దాదన్నగారి విఠల్ రావు,నందిపేట్,డొంకేశ్వర్ మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు,రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందవద్దు

**-మన జిల్లాకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది.**
**-ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి..**



**ఆర్మూర్,జూన్ 15 (సామాజిక తెలంగాణ):** ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి సోమవారం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందవద్దని అన్నారు.మన జిల్లాకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.ఇప్పటికే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి చొరవతో 39వేల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా నిజామాబాద్ జిల్లాలో స్టోర్ అయి ఉన్నది.

దాని నుండి 16 వేల మెట్రిక్ టన్నుల యూరియాని జిల్లాకు చెందిన ఒక లక్ష యాభై వేల మంది రైతులు అప్లికేషన్ ద్వారా బుక్ చేసుకుని యూరియాని డెలివరీ చేసుకున్నారు. ఇంకా 23 వేల మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అందుబాటులో ఉన్నది. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భ్రష్టు పట్టుపోయి డిఫాల్ట్ గా మిగిలిపోయిన సొసైటీల కారణంగా యూరియాని డబ్బులు కట్టి తీసుకురాలేని పరిస్థితిల్లో రైతులకు ఇబ్బంది ఏర్పడుతుంది.రైతులు మీ మీ పరిధిలోని సొసైటీలకు వెళ్లి ఇప్పుడున్న చైర్మన్లు మరియు అధికారుల మెడలు వంచి డబ్బులు కట్టించండి.

డబ్బులు కట్టించే బాధ్యతను మీరు తీసుకోండి యూరియాను సొసైటీలకు ఇప్పించే బాధ్యతను నేను తీసుకుంటాను.సొసైటీలు వారి చేతకాని విధానాన్ని ప్రభుత్వం మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. కావున రైతులు ప్రతిపక్షాల మాటలకు మోసపోవద్దుఅప్లికేషన్ ద్వారా రైతులకు ఇబ్బంది అవుతున్న మాట వాస్తవమే కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 5 సంచులు అవసరం ఉన్నవారు 20 సంచులు దాచి పెట్టుకోవడం వల్ల కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ ఉద్దేశ్యంతో అప్లికేషన్ విధానాన్ని తీసుకురావడం జరిగింది.యూరియా అందుబాటులో ఉంది రైతులు అర్థం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను అని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గ రైతులకు తెలిపారు.

# సర్ తో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్త పడాలి

**మక్తల్ 15 జూన్ (సామాజిక తెలంగాణ)** అధికారులు అడిగిన అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి గారి ఆదేశాల మేరకు సర్ ఓటు హక్కు పరిశీలన ప్రక్రియపై 16వ వార్డులో స్థానిక కౌన్సిలర్ ఆలుకూరి పావని కాంగ్రెస్ నాయకుల సమన్వయంతో విస్తృత ప్రచారం కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 25వ తేదీ నుంచి చేపట్టబోతున్న సర్ ఓటు హక్కు పరిశీలన కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని ఇందులో భాగంగా తమ ఇళ్ల వద్దకు వచ్చిన అధికారులకు ఓటు హక్కుతో పాటు సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకొని వారికి చూయించి ఓటు హక్కు కోల్పోకుండా ఉండేలా చూసుకోవాలని 16 వ వార్డు కౌన్సిలర్ అల్కురి పావని ప్రజలకు సూచించారు ఈ సందర్భంగా 16వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా సర్ ప్రక్రియ ద్వారా చాలా రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓట్లను తొలగించిందని అందుకే ఒక్క ఓటు కూడా దుర్వినియోగం కాకుండా అధికారులు అడిగిన అన్ని పత్రాలను చూయించి ఒక ఓటు కూడా కోల్పోకుండా ఉండేలా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని దురుద్దేశ పూర్వకంగా ఎవరైనా తొలగించడానికి ప్రయత్నించిన వాటిని అడ్డుకొని న్యాయ పద్ధతిలో ఓటు హక్కును నిలుపుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై ఉండాలని సూచించారు సర్





ప్రక్రియపై అందరూ అవగాహన పెంచుకొని ఇతరులకు సైతం అవగాహన కల్పించాలని సూచించారు అధికారులకు అన్ని విధాలుగా సహకరించి వారు అడిగిన అన్ని పత్రాలను చూయించి రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును నిలుపుకోవాలని కోరారు వారితోపాటు మక్తల్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వల్లంపల్లి లక్ష్మణ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాలం స్థానిక నాయకులు మహమ్మద్ రంజాన్ మహమ్మద్ సలీం రాజశేఖర్ బస్సలింగం వీరన్న తదితరులు ఉన్నారు

# ఏ శాఖ నుంచి అనుమతులు లేకుండా బంగారం బిస్కెట్ల తయారీ

**ఆర్మూర్,జూన్ 15 (సామాజిక తెలంగాణ):**

ఆర్మూర్ పట్టణంలో కొందరు వర్తకులు ప్రభుత్వానికి ఎలాంటి జీఎస్టీ చెల్లించకుండా అక్రమంగా నాందేడ్ నుంచి బంగారాన్ని దొంగచాటుగా తీసుకొస్తున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి తీసుకొస్తున్న బంగారంపై ప్రభుత్వానికి జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఆర్మూర్ లోని కొందరు వ్యాపారులు ఎలాంటి పన్నులు చెల్లించకుండా అక్రమంగా నాందేడ్ నుంచి బంగారాన్ని తీసుకొస్తున్నారు. తీసుకొచ్చిన బంగారంలో పౌడర్ కలిపి ఏలాంటి అనుమతులు లేకుండా వేరే కంపెనీల మోనోగ్రామ్ వేసి రసాయనాల పౌడులు కలిపి బంగారు బిస్కెట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు.జీఎస్టీ కాకుండా క్రయ విక్రయాలపై ప్రభుత్వానికి చెల్లించవలసిన



సెల్,ఇన్ కం టాక్స్ లను సైతం ఎగ్గొడుతున్నారు. బంగారంలో పౌడర్లను కలిపి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా 999 ముద్రతో బంగారు బిస్కెట్లు తయారుచేసి మార్కెట్ కంటే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు.ఈ విషయాలు తెలియనీ ప్రజలు తక్కువ ధరకు బంగారం లభిస్తుందని కొనుగోలు చేసి నష్టపోతున్నారు.నాందేడ్ నుంచి తీసుకొచ్చే బంగారంపై పన్నులు ఎగవేసి ఆర్మూర్ కు తీసుకొచ్చి ఇన్కమ్,సెల్ టాక్స్ లను సైతం చెల్లించడం లేదు .ప్రభుత్వానికి ఎలాంటి పన్నులు చెల్లించకుండా గుట్టుచప్పుడు కాకుండా బంగారాన్ని తీసుకొచ్చి బిస్కెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. గతంలో నాందేడ్ నుంచి జిఎస్టి చెల్లించకుండా ఆర్మూర్ కు తీసుకొస్తున్న బంగారాన్ని జిల్లా పోలీసులు పట్టుకున్నారు .పోలీసులు పట్టుకున్న తర్వాత సైతం తిరిగి కొందరు వ్యాపారులు ఈ దందాను దర్జాగా నిర్వహిస్తున్నారు.ఈ దందాపై ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా నాందేడ్ నుంచి బంగారాన్ని తీసుకొచ్చి బిస్కెట్లుగా మార్చి వ్యాపారం చేసే వారిపై చర్యలు చేపట్టాలి.

# విద్యార్థుల భవిష్యత్తుకు మొదటి మెట్టు విద్యాలయాలు - మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని

**జూన్ 15 సనత్ నగర్ (సామాజిక తెలంగాణ)**

పిల్లలకు ఊహ తెలిసిన నాటి నుండే మంచి భవిష్యత్తుకు మార్గం పడాలంటే విద్యాలయాలతోనే సాధ్యపడుతుందని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని తల్లిదండ్రులకు సూచించారు. సనత్ నగర్ ఎస్ ఆర్ టి కాలనీలో ఏర్పాటుచేసిన డెక్కన్ జేమ్స్ పాఠశాలను ఎమ్మెల్యే తలసాని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ గౌరవం, ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలంటే పిల్లలకు మంచి విద్యను అందజేయాల్సిన అవసరం ఉందన్నారు . వారి ఆసక్తి మేరకు డాక్టర్లు ఇంజనీర్లు కలెక్టర్ పోలీస్ అధికారులు కావాలంటే పాఠశాల ద్వారానే మొదటి మెట్టు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్రెడ్డి, పాఠశాల నిర్వాహకులు




మొహమ్మద్ ఇలియాసుద్దీన్, మహమ్మద్ ఫరుద్దీన్, రియాజుదిన్ స్థానిక బి ఆర్ ఎస్ నేతలు మీర్జా ఖలీల్ బేగ్, భోగి బాల్రాజ్, కొత్తపల్లి రమేష్ గౌడ్, కొత్తపల్లి అర్జున్ గౌడ్, సౌదాగర్, వసీం, యువజన నాయకులు రాజేష్ ముదిరాజ్, నోమానుద్దీన్, జమీర్ బెగ్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలుగా సువర్ణ మల్లన్న పాటిల్

**జహీరాబాద్ సామాజిక తెలంగాణ ప్రతినిధి జూన్ 15**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ (డిసిసి) అధ్యక్షురాలు నిర్మాల జగ్గారెడ్డి ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుల పేర్లను విడుదల చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా సువర్ణ మల్లన్న పాటిల్ ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపి. సురేష్ కుమార్ షేట్కార్, డిసిసి అధ్యక్షురాలు నిర్మాల జగ్గారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ గిరిదర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, మాజి జడ్పీటీసీ రాందాస్, నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు



తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని సువర్ణ మల్లన్న పాటిల్ తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సువర్ణ మల్లన్న పాటిల్ ను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారి సంఖ్యలో పాల్గొని శాలువ, పూల దండలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారి సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధేశ్వరాలయంలో సోమావతి అమావాస్య పూజలు

**జహీరాబాద్, సామాజిక తెలంగాణ ప్రతినిధి, జూన్ 15:**

జహీరాబాద్ పట్టణం అల్గోల్ రోడ్డు లోని శ్రీ సిద్ధేశ్వరాలయంలో పురుషోత్తమ మాసం చివరి దినం సోమావతి అమావాస్య సందర్భంగా సోమవారం నాడు స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు సంగయ్య స్వామి జహీరాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ శిరీషా సురేందర్ రెడ్డి, వర్షిత్ రెడ్డి, సుషీల్ రెడ్డి కుటుంబికుల చేత ప్రత్యేక రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. స్థానిక బొమ్మ నాగ శ్వేత, దేశెట్టి పాటిల్ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రతి అమావాస్య తో పాటు ప్రతి సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సంగయ్య



స్వామి పేర్కొన్నారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప, శివశక్తి సంఘం బాధ్యులు సూదాం వెంకట్, గాల్ రెడ్డి, శంకర్, ఎన్నం రఘు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య బేగంపేట్ సిఐ సైదులు



**జూన్ 15 బేగంపేట్ (సామాజిక తెలంగాణ)**

వేసవి సెలవుల అనంతరం, పాఠశాల పునా: ప్రారంభం రోజున బేగంపేట, ఓల్డ్ కస్టశీ బస్తి లోని గ్రానూ పాఠశాల విద్యార్థులకు వా× షఫీ, ప్రదానోపాధ్యాయులు యాదగిరి మరియు పాఠశాల ఇతర ఉపాధ్యాయులతో కలసి స్వాగతం తెలిపి, ఈ విద్యా సంవత్సరానికి సంబందించిన నూతన పాఠ్య పుస్తకాలను మరియు మిత్రుల నుండి సేకరించిన సుమారు 300ల స్టీల్ ప్లేట్ మరియు గ్లాసులను పంపిణీ చేశారు బేగంపేట్ సిఐ సైదులు, అలాగే గడిచిన సంవత్సరంలో మంచి మార్కులు పొందిన విద్యార్థులను అభినందించడం జరిగింది. ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థుల భవిష్యత్తు కొరకు సహకరించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలియచేసి, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని మంచిగా చదువుకొని, ప్రభుత్వ పాఠశాలలకు, తల్లిదండ్రులకు మరియు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు,భవిష్యత్తులో మరింత మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యార్థులకు సహాయం చేయాలని కోరారు

# గవర్నమెంట్ హాస్పిటల్ సూపెరటెండ్ కు వినతి పత్రం ఇచ్చిన గూడపు రణధీర్



**జూన్ 15 సామాజిక తెలంగాణ గోదావరిఖని న్యూస్**

ఈరోజు అనారోగ్యంతోనే అడ్మిట్ అయిన పేషంట్లకి సరైన వైద్య సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది నర్సులు పేషంట్లను పట్టించుకోకపోవడం వలన చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.జూనియర్ డాక్టర్లతోపాటు సీనియర్ డాక్టర్లు కూడా అందుబాటులో ఉండాలని పేషెంట్లుకు రాసిన మందులు సగం బయట కొనుక్కోవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది కావున. పేషెంట్లకు అందించే ఆహారంలో నాణ్యత ఉండకపోవడం వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యులకు నిర్వహించే రక్త పరీక్ష మూత్ర పరీక్ష సకాలంలో రిపోర్ట్స్ ఇవ్వక ఇబ్బందులు గురవుతున్నారు. వీటన్నింటిపై త్వరగా చర్యలు తీసుకొని పరిష్కారం చూపించాలని ఈ సందర్భంగా గూడెపు రణధీర్ కోరినారు .

## కమిషనర్ ఆఫ్ పోలీస్ బి.సుమతి ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్.తిరుమలేష్,కె.గోపాల్



**హైదరాబాద్ ( సామాజిక తెలంగాణ దినపత్రిక ) జూన్ 15 :**

సోమవారం హైదరాబాదులోని మల్కాజ్ గిరిలో కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ బి.సుమతి ఐపిఎస్ గారిని జోగులాంబ గద్వాల జిల్లా కు చెందిన ఎస్. తిరుమలేష్,కె.గోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి మేడం గారి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.అదేవిధంగా గత నెల క్రితం కమీషనర్ బి.సుమతి గారు దిల్ సుఖ్ నగర్ ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో పోకిరిల ఆట కట్టించేందుకు తీసుకున్న ధైర్యాన్ని,సాహసాన్ని ఈ సందర్భంగా కొనియాడారు.ఈ సందర్భంగా వీరితో కమీషనర్ అఫ్ పోలీస్ బి.సుమతి గారు మాట్లాడుతూ....ప్రస్తుతం మన జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షాలు ఎలా ఉన్నాయని,రైతులు ఏ ఏ పంటలు పండిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

# ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేత



**ఆర్మూర్,జూన్ 15 (సామాజిక తెలంగాణ):**

ఆలూరు గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త చౌకే సంఘం శ్రీను తల్లి చనిపోవడంతో రాకేష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా శ్రీను కు సోమవారం ఆర్థిక సాయం అందజేయడం జరిగింది.శ్రీనుకు భవిష్యత్తులో ఏ అవసరం ఉన్నా ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా సాయం చేస్తామని ఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో హరీష్,మల్లయ్య,సుభాష్, అరుణ్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బాబాయ్ పిన్నిల స్వగృహానికి వెళ్లి ఆప్యాయతగా పలకరించిన ఎమ్మెల్యే తలసాని



**జూన్ 15 సికింద్రాబాద్ (సామాజిక తెలంగాణ)**
నిత్యం వివిధ కార్యక్రమాలతో ఎంతో బిజీ బిజీగా ఉండే మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన పిన్ని, బాబాయి లతో కొంత సమయం గడిపారు. సీతా ఫల్ మండి లోని ౨౼ క్వార్టర్స్ లో నివాసం నివాసం ఉంటున్న తన తల్లి లలితా బాయి సోదరీ అయిన పిన్ని సుభద్ర, బాబాయి కొండయ్య లను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం కలిసి ఆత్మీయంగా పలకరించారు. ముందుగా వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో తను గడిపిన రోజులను ఈ సందర్భంలో గుర్తు చేసుకున్నారు. పిన్ని బాబాయి లను జాగ్రత్తగా చూసుకోవాలని అక్కడే ఉన్న వారి కుమారుడు కుమార్ కు సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**




**జగిత్యాల సామాజిక తెలంగాణ జిల్లా ప్రతినిధి**
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అధికారులను జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తారని, అధికారులు తమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందగా, వాటిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## భవాని మందిరంలో శ్రీ లలితా జ్ఞాన యజ్ఞ ప్రవచనం




**జహీరాబాద్,సామాజిక తెలంగాణ ప్రతినిధి, జూన్ 15:**
జహీరాబాద్ పట్టణంలోని శ్రీ భవాని మాత మందిరంలో ఈనెల 19 నుండి 28 వరకు బ్రహ్మశ్రీ మల్లంపల్లి మల్లికార్జున శర్మ ద్వారా శ్రీ లలితా జ్ఞాన యజ్ఞ ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. పది రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమం ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమై 8 గంటలకు ముగుస్తుందని పేర్కొంది. శ్రీ లలితా సహస్ర నామ స్తోత్ర వైభవం, నామ రహస్య వివరణ, లలితా సహస్ర నామ పారాయణ విశిష్టత గురించి సోదాహరణంగా వివరించడం జరుగుతుందని, భక్తులు నిర్ధారిత సమయానికి విచ్చేసి సత్సంగ సభలో పాల్గొనాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# రూ.2.70 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు

**-మెదక్ పట్టణ రూపురేఖలు మార్చే దిశగా భారీ అభివృద్ధి కార్యక్రమాలు**
**-ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం**



**మెదక్, జూన్ 15 (సామాజిక తెలంగాణ):-**
మెదక్ పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో మొత్తం రూ.2 కోట్ల 70 లక్షల 50 వేల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, సీసీ డ్రెయిన్లు, స్లాబులు, తాగునీటి సదుపాయాల కల్పన వంటి కీలక పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ప్రతి కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాను. అభివృద్ధి ఫలాలు ప్రతి వార్డుకు, ప్రతి కుటుంబానికి చేరేలా నిరంతరం పనిచేస్తున్నాను" అని తెలిపారు. వార్డులో అభివృద్ధి జోరు -- సీసీ రోడ్లు, డ్రెయిన్లు, స్లాబులతో మౌలిక వసతుల బలోపేతం మొదటగా 10వ వార్డులో ఎండి అత్తర్ షరీఫ్ నుండి జియావుద్దీన్, తిరుపతి ఇంటి వరకు అలాగే బస్తీ దవాఖానా నుండి గౌడ నాగులు, బండి నర్సింలు ఇంటి వరకు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రోడ్లు ఒక ప్రాంత అభివృద్ధికి అద్దం పడతాయి. ప్రజలు వర్షాకాలంలో ఇబ్బందులు పడకుండా నాణ్యమైన రోడ్లు నిర్మిస్తున్నాం" అని పేర్కొన్నారు. అనంతరం 27వ వార్డులో రూ.35 లక్షల వ్యయంతో వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "పట్టణంలోని ఏ వార్డు అభివృద్ధికి దూరంగా ఉండకూడదు. ప్రతి కాలనీకి సమాన ప్రాధాన్యత ఇస్తున్నాం" అన్నారు. 11వ వార్డులోని సాయినగర్ కాలనీ, వెంకట్రావు నగర్ కాలనీ, రషీద్ కాలనీలలో రూ.52 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,



"వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం కోసం ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అన్నారు. వార్డు 13లో రూ.1.06 కోట్ల భారీ పనులు – మెదక్ అభివృద్ధి చరిత్రలో మరో మైలురాయి పట్టణంలోని 13వ వార్డు, నల్లపోచమ్మ కాలనీ, మీరా కాలనీలలో రూ.1 కోటి 6 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ, "ఎన్నో సంవత్సరాలుగా మౌలిక వసతుల కోసం ఎదురుచూస్తున్న ప్రాంతాలకు ఇప్పుడు అభివృద్ధి చేరుతోంది. ప్రజల అవసరాలే మా ప్రభుత్వ ప్రాధాన్యత. ఈ పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి" అని అన్నారు. అదేవిధంగా 14వ వార్డులో శ్రీ గట్టమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. అలాగే 24వ వార్డులో రూ.30 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు, స్లాబులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. 15వ వార్డులో ఖైరత్ అలీ ఇంటి నుండి ఖైసర్ పాషా ఇంటి వరకు, హైదర్ ఇంటి నుండి రజక సంఘం వరకు, రహమత్ ఇంటి నుండి రామవ్వ ఇంటి వరకు వివిధ ప్రాంతాల్లో రూ.17.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజలు



నన్ను ఎన్నుకున్నది అభివృద్ధి కోసం. అందుకే ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాం. పట్టణంలోని ప్రతి బస్తీ, ప్రతి కాలనీ అభివృద్ధి చెందే వరకు మా కృషి ఆగదు" అని స్పష్టం చేశారు. తాగునీటి సమస్యకు చెక్ – ఎం ఎస్ ఎస్ ఓ ఆధ్వర్యంలో 3 బోరు మోటార్ల ప్రారంభం పట్టణంలోని 3వ వార్డులో ఎం ఎస్ ఎస్ ఓ (మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు తాగునీటి బోరు మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం మా బాధ్యత. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు కనీస అవసరాలు అందేలా నిరంతరం కృషి చేస్తాం" అని తెలిపారు. ప్రజలతో మమేకమవుతూ ప్రతి సమస్యను స్వయంగా తెలుసుకుంటూ పరిష్కార మార్గాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మెదక్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి పట్టణం మరియు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

**మక్తల్ 15 జూన్ (సామాజిక తెలంగాణ)**
బ్యాంకుల ముసుగు లో కూలీలను వేధిస్తే ఊరుకునేది లేదు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4 వ మహాసభలను జూన్ 20 21 22 మహబూబ్నగర్ జిల్లా పట్టణంలో జరిగే మహాసభలను జయప్రదం చేయండి సి ఆర్ గోవింద్ రాజ్ (సిపిఐ ) ఎం జిల్లా కమిటీ సభ్యులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అశోక్ మక్తల్ మండలంలోని దాసరి దొడ్డి గ్రామంలో ఉపాధి కేంద్రాన్ని సందర్శించి వ్యవసాయ కూలీలను ఉద్దేశించి సి ఆర్ గోవింద్ రాజ్ అశోక్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికు లు పోరాడి సాధించుకున్న మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కొనసాగించాల నీ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నీ నిర్వీర్యం చేసే కుట్రల భాగంగా పేరు మారుస్తూ (విబిజీ రామ్ జి చట్టం) తేవడం మహాత్ముని అవమానించడమే అన్నారు విబిజి రామ్ జి రద్దు కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు సోమవారం దాసరిపల్లి లో ఉపాధి పని ప్రదేశంలో మండల కార్యదర్శి అశోక్ తో కలిసి కూలీలతో మాట్లాడారు కూలీలకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని పని ప్రదేశంలో రెండు పూటల ఫోటో క్యాప్చర్ తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు పని ప్రదేశంలో మంచినీటి వసతి ప్రతిరోజు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ తట్ట బుట్ట ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పారలు టెంట్లు సరఫరా చేయాలని కోరారు అలాగే కొలతల పద్ధతిని రద్దుచేసి రోజు కూలి రూ' 800 ఇవ్వాలని ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జూన్ 20 న ఉమ్మడి మహబూబ్నగర్ పట్టణ కేంద్రంలో






తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 4 వ మహాసభ బహిరంగ సభకు ముఖ్య అతిథి కామ్రేడ్ మాణిక్ సర్కార్ త్రిపుర మాజీ ముఖ్యమంత్రి హాజరవుతున్నారు కేంద్ర నాయకులు రాష్ట్ర నాయకులు ఈ మహాసభలలో పాల్గొంటున్నారు ఈ మండలంలోని వ్యవసాయ కూలీలు రైతులు ప్రజలు మహిళలు యువకులు విద్యార్థులు మేధావులు అత్యధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో దాసరి దొడ్డి వ్యవసాయ కూలీలు లింగప్ప వెంకటప్ప గౌరప్ప తిమ్మయ్య శంకరప్ప సూగమ్మ వసంతమ్మ మారెమ్మ, పద్మమ్మ, మలన్ బి తాయమ్మ తదితరులు పాల్గొన్నారు

# సర్దార్ పటేల్ నగర్ (కె పి హెచ్ బి) కాలనీలో ఘనంగా మందలపు సాయిబాబు చౌదరి 51వ జన్మదిన వేడుకలు

జూన్ 15 (సామాజిక తెలంగాణ) :

కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజామనిషి, సామాజిక సేవకులు మందలపు సాయిబాబు చౌదరి51వ జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, అనుచరులు, మిత్రులు మరియు స్థానిక ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛాలు, గజమాలలతో సన్మానించారు. బాణాసంచా కాల్చి, నినాదాలతో జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మందలపు సాయిబాబు చౌదరి గత 25 సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. కరోనా కాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ, వరదలు మరియు ఇతర ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, పేదలకు వైద్య సహాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ స్వయంగా మందలపు



సాయిబాబు చౌదరి కి బొకే అందజేసి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ,మందలపు సాయిబాబు చౌదరి ప్రజల కోసం నిరంతరం సేవ చేస్తున్న నాయకుడు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ఇంకా ఎక్కువ సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరుకుంటున్నాను. సమాజానికి ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమైనవి అని పేర్కొన్నారు. అలాగే ఆయనకు ఆశీర్వాదాలు అందజేస్తూ, ఆయురారోగ్యాలతో నిండి ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అభిమానులు, మిత్రులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ సంఘాల నాయకులు మందలపు సాయిబాబు చౌదరి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

# మహాకవి మహాప్రస్థానం సృష్టికర్త శ్రీ శ్రీ గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి సిపిఎం కూకట్పల్లి బాలనగర్ మండల కమిటీలు

కూకట్పల్లి సామాజిక తెలంగాణ.

శ్రీ శ్రీ 43వ వర్ధంతి సందర్భంగా సిపిఎం కూకట్పల్లి బాలనగర్ మండల కమిటీ ల ఆధ్వర్యంలో శ్రీ శ్రీ నగర్ సిఐటియు ఆఫీస్ లో వర్ధంతి సభ నిర్వహించి చిత్రపటానికి సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ సత్తయ్య పూలమాలవేసి నివాళులు అర్పిం ఈ కార్యక్రమానికి సిపిఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి సత్యం కార్యదర్శి వర్గ సభ్యులు ఐ రాజశేఖర్ జిల్లా నాయకులు కూకట్పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్ ఐద్వా కార్యదర్శి ఏ విజయ పాల్గొని ప్రసంగించారు వారు మాట్లాడుతూ శ్రీరంగం శ్రీనివాస్ శ్రీశ్రీ గొప్ప విప్లవ రచయితని ఈ సమాజంలో దోపిడీ లేని సమ సమాజం కావాలని కోరుకున్న మహనీయుడని ఆయన జీవితాంతం మొత్తం సాంప్రదాయాల రచనల కంటే విప్లవ రచనల వైపు ఆకర్షితులై రచనలు చేశాడని కొనియాడారు ఆయన 1910 ఏప్రిల్ 30న జన్మించాడని విద్యాభ్యాసం విశాఖలో అలాగే మద్రాసులో చేశారని 1930 తర్వాత విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షునిగా చేశాడని అన్నారు కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు కొంతమంది యువకులు నవయుగపు దూతలు అలాగే పతితులార భ్రష్టులార దగా పడ్డ




దస్తులారా ఏడవకండి ఏడవకండి వస్తున్నాయి వస్తున్నాయి జగన్నాథ రథచక్రాలు వస్తున్నాయి రథచక్రాల ప్రళయ గోశా భూ మార్గం పట్టిస్తాం భూకంపం సృష్టిస్తాశీ అవసరమైతే పరిగెత్తు వీలైతే నడువు అది కూడా చేతకాకుంటే పాకుతూ వెళ్ళు దాహానికి పనికిరాని దేహానికి పనికొచ్చే సముద్ర కెరటాలు పైకి ఎగిసే కన్నీళ్లు కారిస్తే సరిపోదు చెమట చుక్క చిందిస్తే చరిత్ర సృష్టిస్తావ్ పదండి పదండి ముందుకు ముందుకు పదండి పదండి తోచుకో ఇలాంటి ఎన్నో విప్లవ రచనలను అభ్యుదయ సినిమా గేయాలు ఎన్నో రాశారని కొనియాడారు కావున ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని కమ్యూనిస్టు విలువలను ఈ సమాజానికి అందించడంలో ఆయన రచనల ద్వారా కృషి చేశాడని 1983 జూన్ 15 నా మరణించారని ఆయన ఆశయాలను నేటితరం యువత ప్రజలు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ కామ్రేడ్స్ లింగారెడ్డి ధర్మారావు సుధాకర్ అజయ్ జగన్ ఖాజాబీ రజియా బేగం ఆవాజ్ నాయకులు ఫయాజ్ అహ్మద్ బోరెల్లి రాములు వెంకటరామిరెడ్డి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో తీరనున్న అన్నరైతుల కష్టాలు

**- ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భేటీ**

**- భూసేకరణకు తక్షణ చర్యలు ప్రత్యేక జీవో అవసరం లేదన్న ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్**

**-భూసేకరణపై వెంటనే కార్యాచరణ చేపట్టాలని సూచన**

**- షాద్‌నగర్ ప్రజల తాగునీటి, సాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యం**

**-జిల్లా కలెక్టర్‌తో చర్చించి భూసేకరణ వేగవంతం చేస్తామని హామీ**

షాద్ నగర్ సామాజిక తెలంగాణ జూన్ 15:

షాద్‌నగర్ ప్రజల తాగునీటి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రయత్నాల్లో మరో కీలక ముందడుగు పడింది. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్‌ను కలిసి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు తాగునీటి, సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, రిజర్వాయర్ నిర్మాణంలో భూసేకరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియను తక్షణమే ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉండటంతో ప్రత్యేక జీవో లేదా అదనపు అనుమతుల అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి భూసేకరణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు ఏఎంసీ డైరెక్టర్ టి. కర్ణాకర్, తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ పాల్గొన్నారు.

# భారత్, శ్రీలంక మధ్య శతాబ్దాల సాంస్కృతిక బంధాలు





బషీర్ బాగ్, జూన్ 15 (సామాజిక తెలంగాణ) :

భారత్, శ్రీలంక మధ్య శతాబ్దాల నాటి సాంస్కృతిక బంధాలు, అలాగే ఉమ్మడి అభివృద్ధి ప్రయాణానికి నిదర్శనంగా నిలిచే విశేష దృశ్యం శ్రీలంక రాజధాని కొలంబోలో ఆవిష్కృతమైంది. ఒకవైపు, భారతీయ మూలాల తమిళ సమాజానికి చెందిన అప్-కంట్రీ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ సొసైటీ తన 20 ఏళ్ల విశిష్ట విజయాలను ఘనంగా జరుపుకుంది. మరోవైపు, భారతదేశం, శ్రీలంకకు చెందిన 5,000 మంది నర్తకులు కలిసి అతిపెద్ద భరతనాట్యం తరగతి ను నిర్వహించి, గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించడం ద్వారా కొత్త ప్రమాణాన్ని నెలకొల్పారు. ఇరు దేశాలకు చెందిన కళాకారులు, విద్యావేత్తలు, కమ్యూనిటీ సభ్యులు ఈ చారిత్రాత్మక సందర్భంలో ఒకచోట చేరి, సాంస్కృతిక, విద్యా, ప్రజల మధ్య సహకారానికి కొత్త అధ్యాయాన్ని లిఖించారు. జూన్ 14న నిర్వహించిన యుడిఈఎస్ కార్యక్రమంలో, శ్రీలంకలో భారత హై కమిషనర్ సంతోష్ ఝా భారతీయ మూలాల తమిళ సమాజాన్ని భారత్, శ్రీలంక మధ్య సజీవ వారధి గా అభివర్ణించారు. గత రెండు దశాబ్దాలుగా విద్య, అభివృద్ధి రంగాల్లో ఆ సమాజం చేసిన సేవలను ఆయన ప్రశంసిస్తూ, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ సమాజం ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. నేడు విడుదల చేసిన ఒక ప్రకటనలో, కొలంబోలోని భారత హై కమిషన్ పేర్కొంది.

# మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం

**-500 మందికి పైగా నిరుపేదలకు అన్నప్రసాద వితరణ.**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి,జూన్ 15, (సామాజిక తెలంగాణ):

అమావాస్య సందర్భంగా మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఐబీ చౌరస్తాలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దాత మహాజన్ రూపాలి రఘునందన్ దంపతుల సహకారంతో, ప్రతినెలా నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమంలో దాదాపు 500 మందికి పైగా నిరుపేదలకు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ సేవా కేశెట్టి వంశీకృష్ణ మాట్లాడుతూ, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం గొప్ప సేవ అని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దాత రఘునందన్ మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల స్మృతిలో ఈ సేవ చేస్తున్నామని, వాసవి క్లబ్ సహకారంతో ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేవే పరమావధిగా ముందుకు సాగుతామని వాసవి క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్లు పడకంటి శ్రీనివాస్, ఇరుకుల్ల సూర్యనారాయణ, వాసవి క్లబ్ కార్యదర్శి గుండా మనోహర్, నస్పూర్ మండల్ వాసవి క్లబ్ కార్యదర్శి తోట రాజయ్య, కోశాధికారి చందూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అతిథులు ఆత్మీయులు అభిమానుల మధ్య ఘనంగా బిజెపి సీనియర్ నాయకులు పిట్ల మనోహర్ జన్మదిన వేడుకలు



జూన్ 15 సనత్ నగర్ (సామాజిక తెలంగాణ)

బంగారు మైసమ్మ ఆలయ చైర్మన్ ( ఈ. ఎస్. ఐ.)లో బిజెపి సీనియర్ నాయకులు పిట్ల మనోహర్ 67వ జన్మదిన శుభ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించి, కుటుంబ సభ్యులతో బంధుమిత్రుల తో ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహిశీచ్చారు. అనంతరం పిట్ల మనోహర్ బంగారు మైసమ్మ దేవాలయ చైర్మన్, మరియు భారతీయ జనతా పార్టీ మూసాపేట్ 117 డివిజన్ పూర్వ అధ్యక్షులు వారి 67 వ జన్మదిన వేడుకలు. బంధుమిత్రుల మధ్య...రంగ రంగ వైభవంగా, కన్నుల పండుగగా ఎంతో ఉత్సాహంగా సంతోషంగా ఆలయ ప్రాంగణంలో జరిగాయి. బంధుమిత్రులకు చక్కటి విందు భోజనము ఏర్పాటు చేశారు సాయంత్రం కొంతమంది పేద మహిళలకు(5 మంది మహిళలకు) వారి జీవనోపాధి కొరకు కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగింది. మరియు సుమారు 100 మంది పైగా పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అందరూ సుఖసంతోషాలతో ఆయువు ఆరోగ్యాలతో ఉండాలని అమ్మవారికి పిట్ల మనోహర్ ప్రత్యేకంగా ఆకాంక్షించారు

# గంగన్నగూడ గ్రామంలో హై లెవెల్ బ్రిడ్జి ప్రారంభం

**-గ్రామస్థుల దశాబ్దాల కల సాకారం: ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు**
**-గంగన్నగూడ గ్రామ ప్రజల దశాబ్దాల నాటి కల నెరవే రిందని గ్రామ సర్పంచ్ విక్రమ్ రెడ్డి, పీ ఏ సి ఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి తెలిపారు**





షాద్ నగర్ సామాజిక తెలంగాణ జూన్ 15 :
రూ. 1.25 కోట్ల హెచ్ఎండీఏ నిధులతో నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించిన సంద ర్భంగా గ్రామంలో ఆనందో త్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ఈ బ్రిడ్జి నిర్మాణంతో వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. గంగన్నగూడ గ్రామం నుంచి అనేక గ్రామాలకు రాకపోకలు కొనసాగుతున్నందున ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఈ పనిని పూర్తి చేశామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్న ఆయన, నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు.

# శేరిపల్లి బందారం రేగటమ్మ జాతరలో భక్తుల కోసం చలివేంద్రం

**- గంప మల్లేశం గుప్త జ్ఞాపకార్థం ఏర్పాటు**



దౌల్తాబాద్, జూన్ 15 (సామజిక తెలంగాణ )
దౌల్తాబాద్ మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రేగటమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా భక్తుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ గణేష్ ఆగ్రో కెమికల్స్ యజమాని గంప రవి గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక చలివేంద్రం ఏర్పాటు చేశారు. తమ తండ్రి గంప మల్లేశం గుప్త జ్ఞాపకార్థంగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివస్తున్న భక్తులకు స్వచ్ఛమైన చల్లని తాగునీరు అందించేందుకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సదుపాయం కల్పించడం తమ బాధ్యతగా భావించి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం బందారం రేగటమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని గంప రవి గుప్త వెల్లడించారు. సమాజ సేవలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. జాతరకు విచ్చేసిన భక్తులు చలివేంద్రం ద్వారా అందుతున్న తాగునీటి సదుపాయాన్ని వినియోగించుకుంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల హాజరు 100 శాతం ఉండాలి మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు



దౌల్తాబాద్ జూన్ 15 (సామజిక తెలంగాణ )
విద్యా సంవత్సరం తొలి రోజు సోమవారం దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు ఇందుప్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్మాణంలో ఉన్న డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా కృషి చేయాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారమే వండాలని, వంటగదిలో పరిశుభ్రత, శుచి-శుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందుప్రియాల్ సర్పంచ్ స్వాతి స్వామి, దుబ్బాక ఆత్మ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, ఇందుప్రియాల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. షకీల్ పాషా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు కేటాయించండి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలో**
**-తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు డిమాండ్**




షాద్ నగర్ సామాజిక తెలంగాణ జూన్ 15:
రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇందిరమ్మ ఇళ్లను డబుల్ బెడ్ రూమ్ లను ప్రభుత్వం నిర్మించి వెంటనే ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశార. ఈ సందర్భంగా ఆయన ఆదివారం నాడు షాద్ నగర్ పట్టణంలోని యూనివర్సల్ మినీ ఫంక్షన్ హాల్ లో రంగారెడ్డి జిల్లా 12 వ మహాసభలకు హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని భూమిలేని పేదలకు సంవత్సరానికి 12,000 ఇవ్వాలని రైతుబంధు పూర్తిస్థాయిలో వేయాలని ఆయన డిమాండ్ చేశారు అదేవిధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం గడిచిన 12 సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేద ప్రజల నడ్డి విరిచే విధంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని పోరాటాలకు సమయసం చేయడం కోసం కార్మిక కర్షిక మైత్రితో ఈ యొక్క బీజేపీ ప్రభుత్వం 29 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా తెచ్చి కార్మిక వ్యతిరేక విధానా లను అవలంబిస్తా ఉంది రైతందానికి వ్యతిరేకంగా రైతు చట్టాలను తీసుకొచ్చి రైతుల మెడలకు ఉరితాడుగా బిగిస్తున్న బిజెపి విధానానికి వ్యతిరేకంగా పోరాటానికి సన్నద్ధం కావాలని ఉపాధి హామీ కూలీలను పని దినాలను తగ్గిస్తూ కొత్త చట్టాన్ని తీసుకొస్తూ వ్యవసాయ కూలీలకు ఉపాధి దొరకకుండా కార్పొరేట్లకు ఊడిగము చేసే విధంగా కొత్త చట్టాలను తీసుకొస్తా ఉండండి బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ప్రజా పంపిణీ ద్వారా ఉచితంగా 14 రకాల సరుకులను ఇవ్వాలని గ్యాస్ సిలిండర్ పెట్రోలు నిత్యవసర సరుకులు ధరలను తగ్గించాలని ఆ విధంగా ప్రజలను ప్రభుత్వంపై పోరాటం కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సన్నద్ధం చేయాలన్నారు చేయాలని ఆయన ప్రజలు రైతు కార్మిక వ్యవసాయ కూలీల ప్రజా సమస్యల పైన రానున్న రోజుల్లో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని కార్మికులను కూలీలను సంఘటితం చేసి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వహించే పనుల్లో ఉందని జులై ఒకటో తేదీన పెద్ద ఎత్తున పోరాటం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు మా మహాసభలో జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ కార్యదర్శి నివేదికను ప్రవేశ పెడుతూ మాట్లాడారు అనంతరం మండల ప్రతినిధులు చర్చలు జరిపి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించారు అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎన్నిక**

జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కందుకూరి జగన్ అంజయ్య ఉపాధ్యక్షులుగా శ్రీనునాయక్, బేకరీ అంజయ్య, బి శివ, సహాయ కార్యదర్శిగా సిహెచ్ జంగయ్య, శ్యాంసుందర్ కుమార్, కమిటీ సభ్యులుగా కాళ్ల జంగయ్య, బీజాని అజయ్, బస్సు ఆవుల యాదయ్య, కాపురం దయ్యాల గణేష్, కావాలి జగన్, సిహెచ్ పుష్ప, సత్యం కావాలింజనేయులు, ఏ రవి, పి నరసింహ, సైదమ్మ అంబేద్కర్ దేవయా లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం జిల్లాప్రజా సంఘాల నాయకులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బాక రామచందర్, సిఐటి యు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ రాజు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయక్, బేరి శ్రీనివాస్ ఆవాజ్ నాయకులు మహమ్మద్ బాబు రాజు ఏటూరి కురుమయ్య మరియు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యవసాయ కార్మికులు ఉపాధి కూలీలు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట

**- మండల విద్యాధికారి గజ్జేల కనకరాజు**
**యంగ్ ఇండియా కిట్లు, నూతన యూనిఫామ్స్ పంపిణీ**
**-పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి**

దౌల్తాబాద్ జూన్ 15(సామజిక తెలంగాణ )
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జేల కనకరాజు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యంగ్ ఇండియా కిట్లతో పాటు ఆకర్షణీయమైన నూతన రంగులతో




కూడిన యూనిఫామ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వాటిని సకాలంలో పంపిణీ చేసినట్లు వివరించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యా సామగ్రి అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ఉపాధ్యాయుల పనితీరు మెరుగుదల, డిజిటల్ విద్య, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యాల పెంపు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందిస్తున్నాయని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని మండల విద్యాధికారి గజ్జేల కనకరాజు ఆకాంక్షించారు

# సమయానికి రాని దౌల్తాబాద్ రెవెన్యూ సిబ్బంది

**-పదకొండు దాటినా పత్తా లేని అధికారులు**
**-ప్రజలకు నిరీక్షణ తప్పని పరిస్థితి**

దౌల్తాబాద్ జూన్ 15(సామజిక తెలంగాణ )
ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సకాలంలో సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేయాల్సి ఉండగా, దౌల్తాబాద్ మండల తహశీల్దార్ కార్యాలయంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపించాయి. కార్యాలయ విధులు ఉదయం ప్రారంభం కావాల్సి ఉండగా, సోమవారం ఉదయం 11 గంటలు దాటినా పలువురు రెవెన్యూ సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది. భూముల సంబంధిత సమస్యలు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలు, పహాణీలు, ఇతర రెవెన్యూ సేవల కోసం మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు కార్యాలయం వద్ద గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉదయం నుంచే కార్యాలయానికి చేరుకున్న ప్రజలు సిబ్బంది రాక కోసం వేచి చూడాల్సి రావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయంలో నాయబ్ తహశీల్దార్, ముగ్గురు జీపీఓలు, ఒక కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే విధుల్లో కనిపించగా, మిగతా సిబ్బంది సమయానికి





హాజరు కాలేదని తెలిసింది. ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ, కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ఆ లక్ష్యం నెరవేరడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కార్యాలయ సమయాలను పాటించకపోవడం వల్ల ప్రభుత్వ శాఖలపై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాల్లో సిబ్బంది సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటేనే పరిస్థితుల్లో మార్పు వస్తుందని అభిప్రాయపడుతున్నారు.

# యూరియా యాప్‌తో రైతులకు కష్టాలు సడలింపు

**- కాంగ్రెస్ పార్టీ జిల్లేడు చౌదరిగుడా మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్**

**-ప్రభుత్వం రైతుల మేలు కోసం పాటుపడుతుంది**

**-చౌదరి గూడెం రైతు వేదిక అవగాహన సదస్సు**

**-యాప్ కష్టాల సడలింపు పై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు**



**షాద్ నగర్ సామాజిక తెలంగాణ జూన్ 15 :** రైతుల మెడపై యాప్ అనే గుదిబండను ఉంచి బిజెపి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మనుగడతో చెలగాటం ఆడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లేడు చౌదరిగుడా మండల అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్ తీవ్రంగా విమర్శించారు. చౌదరి గూడెం రైతు వేదికలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు షాద్ నగర్ ఏడి రమాదేవి తదితర రైతులు నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సర్వర్ సమస్యలు, ఓటీపీ ఆలస్యం, ఆధార్ లింకింగ్ లోపాలతో రైతులు గంటల తరబడి యూరియా కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎరువుల సరఫరా విషయంలో యాప్ తెచ్చి తంటాలు పెట్టారని చంద్రశేఖర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ రైతులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతోందన్నారు. యాప్‌లోని లోపాలను వెంటనే సరిదిద్దాలని, రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తమ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వ్యవసాయ శాఖ అధికారుల సమీక్షలు పాల్గొని పలు సమస్యలను రైతుల తరపున వివరించగా వెంటనే వ్యవసాయ శాఖకు చెందిన రాష్ట్రస్థాయి అధికారులు స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి కొంత వెసులుబాటు తీసుకు వచ్చారని చంద్రశేఖర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మేలు కోసం ఎల్లప్పుడు పాటుపడుతుందని మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తిన వెంటనే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారుల బృందంతో చర్చలు జరిపి యాప్ లో సడలింపులు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. పంటకు సరిపడా యూరియా అందించడానికి నిలువలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు మొదట్లో కాస్త ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ రాబోయే కాలంలో ఈ యాప్ ద్వారా ఎంతో మేలు జరగనుందని అన్నారు. అదేవిధంగా యాప్ పై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కొంత వెసులుబాటు కల్పించినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు రైతాంగం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు తుంపల్లి రామచంద్రయ్య, గుర్రంపల్లి జంగయ్య, రావిర్యాల నీలయ్య, ధర్మ తండా చందు నాయక్, పీర్జాపూర్ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చలివేంద్రం పల్లి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, ఏదిరా మాజీ సర్పంచ్ బాలరాజ్, పద్మరం నర్సింలు, గ్రామాల నాయకులు రైతులు పాల్గొన్నారు..

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం




**దౌల్తాబాద్ జూన్ 15(సామజిక తెలంగాణ )**

దౌల్తాబాద్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఈనెల కూడా ఘనంగా నిర్వహించారు. దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు, అవసరమైన భోజనాన్ని అందజేశారు. సేవా భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.ఆర్యవైశ్య సంఘం ప్రతినెల అమావాస్య రోజున ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సామాజిక సేవలో ముందంజలో నిలుస్తోంది. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గంప రవి గుప్తా, సిద్దిపేట జిల్లా పిఆర్ఓ శ్రీరామ్ ప్రణవి, ఏఎంసి డైరెక్టర్ శ్రీరామ్ శ్రీనివాస్,దౌల్తాబాద్ మండల మహిళ అధ్యక్షురాలు పసుపు నూరి పద్మ, ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సముద్రాల పెద్ద శ్రీశైలం, కిషన్,ఆంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

# సోమవతి అమావాస్య - గోదావరి తీరం భక్తిమయం

**-మంచిర్యాల గౌతమేశ్వరాలయంలో మహిళల వ్రతాలు, కొండ పద్మ ఆధ్వర్యంలో పూజలు.**





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,జూన్ 15, (సామాజిక తెలంగాణ):** మంచిర్యాల పట్టణ కేంద్రంలో సోమవారం అమావాస్య పర్వదినాన పవిత్ర గోదావరి తీరం భక్తి మయం తో నిండిపోయింది. గౌతమేశ్వరాలయం ఆవరణలో, గోదావరి ఘాట్ల వద్ద భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చి పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అశ్వర్థ వృక్షం కింద మహిళలు పెద్ద సంఖ్యలో సమావేశమై సామూహిక సోమవతి వ్రతం ఆచరించారు. పసుపు కుంకుమలతో వృక్షానికి పూజలు చేసి 108 ప్రదక్షిణలు చేశారు. సూత్రధారణ, సువాసినీ పూజలతో సుమంగళి ప్రార్థనలు చేపట్టారు. ఆలయ అర్చకులు వ్రత కథను వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇదే సమయంలో మంచిర్యాల కార్పొరేషన్ కో ఆప్షన్ మెంబర్ శ్రీమతి కొండ పద్మ ఆధ్వర్యంలో జై యోగేశ్వర్ బృందం గోదావరి తీరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గడియారం బాలాజీ శర్మ వేదమంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ పద్మ మాట్లాడుతూ ప్రతి సోమవతి అమావాస్యకు గోదావరి తీరంలో ఇదే తరహా పూజలు కొనసాగిస్తామని, భక్తులందరికీ స్వాగతం పలుకుతామని తెలిపారు. కార్యక్రమంలో జై యోగేశ్వర్ బృంద సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి బడిబాటకు స్వాగతం

**- అంగన్వాడి బడిబాటతో పాఠశాలకు శ్రీకారం.**



**దౌల్తాబాద్, జూన్ 15 (సామజిక తెలంగాణ )**

దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల మొదటి రోజు సందర్భంగా అంగన్వాడి కేంద్రం వద్ద మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నారులను పాఠశాలల్లో చేర్పించి విద్యాభ్యాసం పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ పంజ స్వామి, ఉప సర్పంచ్ ప్రేమ్ కుమార్ హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పిల్లల విద్య ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్యాగరాజు, ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్

**-పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి.**

**-శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్.**





**(కరీంనగర్ జిల్లా బ్యూరో/సామాజిక తెలంగాణ పత్రిక ప్రతినిధి)జూన్-15**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పరిశుభ్రంగా,ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న అభివృద్ధి,పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా 36వ డివిజన్‌లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డివిజన్‌లోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, మురుగు కాలువలు, చెత్త సేకరణ కేంద్రాలను సందర్శించిన మేయర్ అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించడంతో పాటు మురుగు కాలువల్లో నీటి నిల్వలు లేకుండా నిరంతరం శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.అనంతరం 22వ డివిజన్‌లో ఇటీవల కురిసిన గాలివాన కారణంగా విరిగిపడిన చెట్ల తొలగింపు పనులను మేయర్ పరిశీలించారు. రహదారులపై పడిన చెట్ల వల్ల ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే తొలగింపు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న చెట్లను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ తోట అనిల్, 22వ డివిజన్ కార్పొరేటర్ బండ రమణారెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు ,డివిజన్ ప్రజలు, నగరపాలక సంస్థ అధికారులు ,పారిశుధ్య సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఇందారం బ్రిడ్జిపై గోధావరి తల్లి కి వందనం

**-బెల్లంపల్లిలో ఘనంగా బాయిబాట - తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేసిన కవిత.**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 15,(సామాజిక తెలంగాణ):**

టీఆర్ఎస్ సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జైపూర్ మండలం ఇందారం బ్రిడ్జి వద్ద గోదావరి తల్లిని దర్శించుకున్నారు. పుష్పాలతో వందనం సమర్పించిన అనంతరం నేరుగా బెల్లంపల్లి చేరుకుని బాయిబాట సభలో పాల్గొన్నారు. బెల్లంపల్లి సెంటర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కవిత, తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెల్లంపల్లి నడిబొడ్డున తమ జెండా ఎగురవేయడం గర్వంగా ఉందని, స్థానిక ప్రజల ఆశీస్సులు తమకు అవసరమని కోరారు. రాబోయే ఎన్నికల్లో బెల్లంపల్లి సీటును టీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.తెలంగాణ రక్షణ సేన 'పాంచజన్యం' పేరుతో ఐదు కీలక అంశాలపై దృష్టి సారిస్తోందని తెలిపారు. స్కూళ్లు తెరుచుకున్నా ఫీజుల భారంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉచిత విద్య, వైద్యం అందిస్తామని, యువతకు 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు గౌరవం ఇస్తూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక రైతు కౌంటర్ ఏర్పాటు చేస్తామని, సామాజిక న్యాయం కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయుని నిర్లక్ష్యంతో విద్యార్థికి విద్యుత్ షాక్


**-బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**



**దేవరకొండ జూన్ 15.సామాజిక తెలంగాణ** నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లి మండలం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా మామిడి తోరణాలు కట్టమని పాఠశాల పక్కన ఆడుకుంటున్న విద్యార్థిని పిలిచిన ఉపాధ్యాయుడు నిర్లక్ష్యం వల్ల నాంపల్లి మండలం బండ తిమ్మాపురం గ్రామానికి చెందిన రామ్ చరణ్ కు విద్యుత్ షాక్ కి గురి కావడం జరిగింది అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు.సోమవారం దేవరకొండ పట్టణంలోని సంజీవ ఆసుపత్రిలో విద్యుత్ షాక్ తో చికిత్స పొందుతున్న రామ్ చరణ్ బిఆర్ఎస్వీ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ఉపాధ్యాయుని సస్పెండ్ చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు. రామ్ చరణ్ కి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుని, విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థికి విద్యుత్ షాక్ రావడం జరిగింది అని ఆయన తెలిపారు. ఉపాద్యాయులు విద్యార్థులతో పని చేయించ వద్దు అని ఆయన అన్నారు. ప్రభుత్వం నిబంధనలు పాటించక పోవడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్వీ నాయకులు జమీర్ బాబా,అనిల్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా కడమంచి సహదేవుడు

**-శుభాకాంక్షలు తెలిపిన బేడ బుడగ జంగం హక్కుల సాధన సమితి**



హైదరాబాద్, జూన్ 15 సామాజిక తెలంగాణ

బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు, జాతి ముద్దుబిడ్డ, బుడగ జంగాల ఆశాజ్యోతి, మృదు స్వభావి, క్రింద స్థాయి నుంచి ఎదిగిన నాయకుడు, అందరితో కలిసిపోయే మనస్తత్వం కలిగిన వ్యక్తి శ్రీ కడమంచి సహదేవుడు గారు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధికార పార్టీలో ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా రాష్ట్రస్థాయిలో కీలకమైన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బేడ బుడగ జంగం హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్రం తరపున ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. సమితి నాయకులు మాట్లాడుతూ, "మిత్రుడు సహదేవుడు గారు ఇంకా అత్యున్నత స్థాయికి ఎదగాలని, రాబోయే కాలంలో అసెంబ్లీ, పార్లమెంట్ లేదా రాజ్యసభలో అడుగుపెట్టాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తున్నాము" అని పేర్కొన్నారు. ఈ రోజు లకిడికాపూల్‌లోని ఆయన చాంబర్ ఆఫీస్‌లో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేడ బుడగ జంగం హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు గగనం వెంకటస్వామి, గ్రేటర్ ప్రెసిడెంట్ గగనం దుర్గాప్రసాద్, సిరిగిరి రాజశేఖర్, మహిళా నాయకురాలు గగనం అలివేలు పాల్గొన్నారు.

# సిపిఎం యువజన సమ్మేళనం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఇబ్రహీపట్నం, జూన్ 15 సామాజిక తెలంగాణ

ఈనెల 16, 17 తేదీలలో జరగనున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర స్థాయి యువజన సమ్మేళనం విజయవంతం కావాలని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. యాచారం మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యవర్గ సభ్యులు ఆలంపల్లి జంగయ్య, శాఖ కార్యదర్శులు సిహెచ్ సత్యం, కే. గిరికాంత్, పార్టీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు. సమ్మేళనం విజయవంతం కావడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.

# వెల్జాల్ గ్రామానికి టి.పి.ఎస్ పాఠశాల మంజూరు

**-గ్రామంలో సంబరాలలో పాల్గొన్న విద్యా కమిషన్ సభ్యుడు డా. చారకొండ వెంకటేష్**




తలకొండపల్లి, జూన్ 15 సామాజిక తెలంగాణ

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వెల్జాల్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టి.పి.ఎస్) మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో గ్రామ ప్రజలు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు. విద్యా కమిషన్ సభ్యుడు డా. చారకొండ వెంకటేష్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్న ఘన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, "పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో వెల్జాల్ గ్రామానికి టి.పి.ఎస్ మంజూరు కావడం పరిసర ప్రాంతాల విద్యార్థులకు కూడా మెరుగైన అవకాశాలు కల్పిస్తుంది" అని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా కోరుకున్న విద్యాసంస్థ ఇప్పుడు గ్రామానికి రావడం సంతోషకరమని, విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులను, ప్రధానోపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించి మెమెంటోలు, నగదు బహుమతులు అందజేశారు. గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ, ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి--విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, ఎంఈఓ చాప్లా నాయక్, ప్రధానోపాధ్యాయులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

**-తెలంగాణ రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృత సమావేశాలను జయప్రదం చేయండి**

**-Cpm జిల్లా కమిటీ సభ్యుడు ఎన్ రాజు పిలుపు**




షాద్ నగర్ సామాజిక తెలంగాణ జూన్ 15:

ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండగా పనిచేస్తూ సమ సమాజం నిర్మాణం కోసం శ్రామిక ప్రజల విముక్తి కోసం, కష్ట జీవుల హక్కుల కోసం పోరాడుతున్న సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృత సమావేశాలు 2026-జూన్ 16,17 తేదీలల్లో రంగారెడ్డి జిల్లా, కొత్తపేట్ బాబు జగ్జీవన్రావు భవన్ లో నిర్వహిస్తున్నామని దీనికి షాద్నగర్ ప్రాంతంలోని ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వచ్చారు. షాద్ నగర్ పట్టణంలో సోమవారం రోజు యువ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించిన అనంతరం ఎన్ రాజు మాట్లాడుతూ అప్రజాస్వామిక పద్దతుల్లో రాజకీయాలు చేస్తున్న బిజెపి మాతాల మధ్యచిచ్చు రాజేస్తున్నది. కులాల మధ్య తగదాలు రేపుతున్నది. తన రాజకీయ లబ్ధికోసం అల్లర్లు సృష్టిస్తున్నది. ఇది ధర్మం కాదు. భారతదేశపు ప్రజాస్వామిక రాజ్యాంగ వ్యవస్థను నాశనం చేసి మన దేశంలో మతం పేరుతో ఒక నిరంకుశ పాలనను ముందుకు తెచ్చింది. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ కంపెనీలకు పన్నును 33 శాతం నుండి 25 శాతానికి తగ్గించింది. ఏ దేశంలోను ఇంత తక్కువ పన్నులు లేవు. ఈ విధానం కార్పోరేట్లకు స్వర్గం- సామాన్యులకు నరకంలా మారింది. అంతేగాక కొద్ది మంది శత కోటీశ్వరులకు పన్ను రాయితీ రూపంలో 55 లక్షల కోట్లు ముట్టచెప్పింది. సెస్స్, టూ పేరుతో డిజిల్, పెట్రోల్, గ్యాస్ వంటి నిత్యవసర సరుకులపై అధిక భారాలు మోపుతున్నది. ఇలా కార్పోరేట్ల ప్రయోజనాల కోసం దేశానికి వెన్నెముక అయినా రైతాంగాన్ని బలిచేస్తున్నది. భగ్నమైన యువత స్వప్నాలు దిగజారుతున్నాయి. నిరుద్యోగ సంక్షోభం తీవ్రస్థాయికి చేరింది. భారత దేశాన్ని కొల్లగొడుతున్న బడా వ్యాపారులు ఆధాని, అంబానిలతో మోడి బంధం బలపడగా వేతనాల కుదింపుతో కార్మిక వర్గం ఆధునిక భానిసత్వంలో కురుకుపోయేల చేసింది. అంతులేని అవినీతి, విస్తరించిన మాఫియా వంటి సమస్యలు, ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజల పక్షాన దేశ ప్రయోజనాలకోసం పోరాడుతున్నది సిపిఐ(ఎం)అని, రంగారెడ్డి జిల్లా డిండి శివన్నగూడ ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపులతో పాటు విద్య వైద్యం రామోజీ ఫిలిం సిటీ సాహెబ్ నగర్ ఫ్యాబ్సిటీ కందుకూర్ తదితర ప్రాంతాల్లో ఇండ్ల స్థలాల కోసం చేవెళ్ల మంచాల షాద్నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం పోరాడుతున్నది అనాజ్పూర్ కప్పపాడు సీలింగ్ భూములు రంగాపూర్ పోడు భూములపై ప్రజల హక్కుల కోసం ఉద్యమిస్తున్నది సిపిఎం పార్టీ. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, త్రిబుల్ ఆర్ రోడ్డు, ఫార్మాసిటీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ఫ్యూచర్ సిటీలో రోడ్ల నిర్మాణం కోసం బలవంతపు భూసేకరణ ఆపాలని ఫార్మాసిటీ నిషేధిత జాబితాలో ఉన్న రైతుల పేర్లను ఆ జాబితా నుండి తొలగించాలని ప్రభుత్వ పోరంబోకు సీలింగ్ పోడు భూములు గతంలో రక్షిత కౌలుదారులు పోరాడే సాధించుకున్న భూముల వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నది ఉపాధి హామీ పథకాన్ని నిర్వర్యం చేసే కొత్త చట్టాన్ని రద్దుచేసి పెండింగ్ బిల్లులో ఇవ్వాలని కోరడమే కాక అరోలైన వారందరికీ రేషన్ కార్డులు పెన్షన్లు ఇవ్వాలని మహిళలపై జరుగుతున్న హత్యలు అత్యాచారాలను ఖండిస్తూ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్నది సిపిఎం ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు ఈ మధ్యకాలంలో కేటాయించిందని అభివృద్ధి పేరుతో రైతుల నుండి వందలాది ఎకరాల భూమిని బలవంతంగా తీసుకొని కార్పొరేట్లకు అప్పజెప్పాలని చూస్తున్నదని ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నదత లో భాగంగా రంగారెడ్డి జిల్లా కొత్తపేట బాబు జగ్జీవన్ రావ్ భవన్లో తెలంగాణ రాష్ట్ర యువ కార్యకర్తల విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నాం ఈ సమావేశాల్లో జయప్రదానికి కార్యకర్తలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ టౌన్ కార్యదర్శి శ్రీను నాయక్, కొత్తూరు మండల కార్యదర్శి బిసా .సాయిబాబు, నందిగామ మండల కార్యదర్శి కొంగరి నర్సింహులు, టౌన్ నాయకులు కే రాజు, ముఖీత్, ఎస్ఎఫ్ఐ నాయకులు, జ౹ఖ సభ్యుడు విజయ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టిపిపి మూడో యూనిట్ పనులపై డైరెక్టర్ సంతృప్తి

**-గడువులోగా పూర్తి చేయాలని తిరుమలరావు సూచన.**





మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 15,(సామాజిక తెలంగాణ):

జైపూర్ మండల పరిధిలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను సింగరేణి డైరెక్టర్ (ఈ & ఎం) ఎం. తిరుమలరావు సోమవారం సందర్శించారు. ఎస్టిపిపి ఈడి సిహెచ్ చిరంజీవి పూల మొక్కతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా తిరుమలరావు 1x800 మెగావాట్ల మూడో యూనిట్ నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత ఏర్పాటు చేసిన సేఫ్టీ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి భద్రతా ప్రమాణాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ట్రాక్ హపర్ వద్దకు వెళ్లి కోల్ అన్‌లోడింగ్ ప్రక్రియను గమనించారు. ప్రస్తుత 2x600 మెగావాట్ల ప్లాంట్‌లో అమలవుతున్న విధానాన్ని చిరంజీవి వివరించగా, కొత్త యూనిట్‌లో రైల్ వ్యాగన్ టిప్లర్ అనే అధునాతన సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ యూనిట్ పనుల వేగం, భద్రతా చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తూ నిర్దేశించిన గడువులోపే మూడో యూనిట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్టిపిపి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చూపిన స్థలాన్ని డైరెక్టర్ పరిశీలించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టిపిపి జీఎం ఎం. మదన్ మోహన్, ఏజీఎం ఓ&ఎం వి.వి. సుధాకర్ రెడ్డి, ఏజీఎం ఈడఎం సూర్యనారాయణ రాజు, 1x800 ఎమ్ డబ్ల్యూ కోఆర్డినేటర్ ఎం.వి. వేణుగోపాల్, డీజీఎం వాటర్ సిస్టమ్ జనగామ శ్రీనివాస్, ఎస్ఓ టు ఈడి వెంకటయ్య, ఎస్ఈ సివిల్ రాము, ఎస్ఈ సేఫ్టీ పులి సురేష్, డీవైపీఎం ఎస్వి రాజేశ్వర్ రావు తో పాటు బీహెచ్ఈఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇందారం, దొరగారిపల్లె రైతులకు పట్టాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

**-సీలింగ్ భూముల రికార్డులు మాయం**

**- కాస్తుదారులకే హక్కులు కల్పించాలని డిమాండ్.**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 15,(సామాజిక తెలంగాణ):

జైపూర్ మండలం ఇందారం గ్రామపంచాయతీ పరిధిలోని ఇందారం, దొరగారిపల్లె గ్రామాల్లో ఇళు నిర్మించుకొని మోక పై వుంటూ కాస్తుదారులుగా బతుకుతున్న రైతులకు పట్టాలు మంజూరు చేయాలని గ్రామస్తులు మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం కలిసి విన్నవించారు. నిజాం కాలంలో దేశముఖ్‌గా ఉన్న గోనె వెంకట ముత్యంరావు ఆధీనంలో ఉన్న భూములను 1970వ దశకంలో అమలైన సీలింగ్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వం రద్దు చేసింది. ఆయన, వారసుడు గోనె రాజసింహారావు పేరిట 60 ఎకరాల భూమి మాత్రమే పట్టాదారు భూమిగా మిగిలింది. అయితే రాజసింహారావు వారసులమని చెప్పుకుంటున్న కొందరు వ్యక్తులు సీలింగ్ చట్టం కింద పోయిన భూములకు సంబంధించిన రెవిన్యూ రికార్డులను మాయం చేశారని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ పోర్టల్‌లో గోనె వెంకట ముత్యంరావు, గోనె రాజసింహారావు పేర్ల మీద కనిపిస్తున్న ఆ భూముల పట్టాలను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. దశాబ్దాలుగా ఇళ్లు కట్టుకొని, సాగు చేసుకుంటున్న అసలైన మోకం కాస్తుదారుల పేరిట పట్టాలు ఇచ్చి గ్రామంలోని అనేక కుటుంబాలకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఇందారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు అరికె సంతోష్ యాదవ్, సుంకరి శ్రీనివాస్, మహమ్మద్ అమీర్, రేగుంట రాకేష్, జలంపల్లి శ్రీనివాస్, చిప్పకుర్తి సతీష్ తో పాటు మోక భూములున్న రైతులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ఆకస్మిక తనిఖీలు చేసిన చైర్మన్ బసవేశ్వర్

**షాద్‌నగర్, జూన్ 15 సామాజిక తెలంగాణ**



వర్షాకాలంలో పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ అధికారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం తెల్లవారు జామున 4:30 గంటలకే ఆయన స్వయంగా రంగంలోకి దిగుతూ ఫరూక్‌నగర్, షాద్‌నగర్ పరిధిలోని పలు కాలనీలను సందర్శించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.వర్షాకాలం నేపథ్యంలో మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా చూడాలని, డ్రైనేజీల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని పరిశుద్ధ కార్మికులకు సూచించారు. ఈ వర్షాకాలం మొత్తం పారిశుద్ధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన ఆదేశించారు.పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రతి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు కూడా చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కీర్తి వెంచర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి త్వరలోనే పూర్తిస్థాయి పనులు చేపడతామని చైర్మన్ బసవేశ్వర్ తెలిపారు. తెల్లవారుజామున నిర్వహించిన ఆకస్మిక తనిఖీల సందర్భంగా ఆయన పరిశుద్ధ కార్మికులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష

**షాద్‌నగర్, జూన్ 15సామాజిక తెలంగాణ**




జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ స్వర్ణకుమారి స్టాప్ డయేరియా క్యాంపెయిన్, పల్స్ పోలియో, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం (NDD), హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ వంటి కీలక ఆరోగ్య కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్ర రెడ్డి మాట్లాడుతూ, స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను జూన్ 1 నుంచి 15 వరకు సన్నాహక దశగా, జూన్ 16 నుంచి జూలై 31 వరకు అమలు దశగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సులభంగా అందుబాటులో ఉండేలా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.జూన్ 28న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.జూలై 13న జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1-19 సంవత్సరాల పిల్లలకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేట్ విద్యాసంస్థల ద్వారా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో మాత్రలు తీసుకోలేని పిల్లలకు జూలై 20న మాప్-అప్ కార్యక్రమం ద్వారా తిరిగి మాత్రలు అందజేయనున్నట్లు వివరించారు.అలాగే 14-15 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తగిన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా-శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఆర్టీసీ రిటైర్డ్ మెకానిక్ జక్కుల నాగరాజు కన్నుమూత

**-నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



**షాద్‌నగర్, జూన్ 15 సామాజిక తెలంగాణ**

రిటైర్డ్ ఆర్టీసీ మెకానిక్, బీసీ జనసేన జాతీయ నియోజకవర్గ అధ్యక్షురాలు జక్కుల జలజ భర్త జక్కుల నాగరాజు సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానిక ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.నాగరాజు ఆర్టీసీలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తూ షాద్‌నగర్ డిపోలో ఎన్నో సంవత్సరాలు సేవలందించారు. విధి నిర్వహణలో నిబద్ధత, సహోద్యోగులతో సత్సంబంధాల ద్వారా మంచి గుర్తింపు పొందారు. కొంతకాలం క్రితమే ఉద్యోగ విరమణ పొందారు.నాగరాజు పార్థివదేహాన్ని షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్నేహితులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.బీసీ జనసేన నాయకురాలు జక్కుల జలజను పలువురు పరామర్శించి తమ సానుభూతిని వ్యక్తం చేశారు

# ప్రతి చిన్నారి ప్రభుత్వ బడిలోకి




**తలకొండపల్లి, జూన్ 15 సామాజిక తెలంగాణ**

ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామ సర్పంచ్ వడ్త్యావత్ శంకర్ నాయక్ పిలుపునిచ్చారు. తాళ్లకుంట తండాలో ఆయన ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి తల్లిదండ్రులకు పిల్లలను చదివించాలని, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు వంటి సదుపాయాలు అందిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మురమ్మ, అంగన్‌వాడీ టీచర్ దేవీ, ప్రధానోపాధ్యాయురాలు రమ్య తదితరులు పాల్గొన్నారు .

# ఐదో రోజుకు చేరిన తాపీ మేస్త్రీల బంద్

**-కూలి రేట్లు పెంచాలని ప్రభుత్వానికి డిమాండ్**



**మర్రిగూడ, జూన్ 15 సామాజిక తెలంగాణ**

మర్రిగూడ మండల కేంద్రంలో తాపీ మేస్త్రీలు చేపట్టిన బంద్ నిరసనలు సోమవారం ఐదు రోజులకు చేరాయి. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా తమ కూలీ రేట్లు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి వారు డిమాండ్ చేశారు.మండల కేంద్రంలో సమావేశమైన తాపీ మేస్త్రీలు మాట్లాడుతూ, “ఎండనక వాననక కష్టపడి పని చేస్తున్నప్పటికీ ప్రస్తుతం లభిస్తున్న కూలీతో కుటుంబ పోషణ భారంగా మారింది” అని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్, గ్యాస్, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగినా కూలీ రేట్లు పెరగకపోవడంతో జీవనోపాధి కష్టమైందని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కూలీ రేట్లను అధికారికంగా పెంచాలని వారు డిమాండ్ చేశారు. “మా సమస్యలు పరిష్కరించకపోతే బంద్ నిరసనలు మరింత ఉధృతం చేస్తాం” అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వెంకటయ్య, యాదగిరి, జంగయ్య, రాములు, రాంబాబు, శంకర్, లింగయ్య, భాస్కర్, సత్తయ్య, ప్రకాష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ‘పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత’

**- సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్**

**- ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్**

**- మేడిగడ్డ తాండలో బ్లీచింగ్ చల్లించిన సర్పంచ్, ఉప సర్పంచ్**




**ఆమనగల్లు, జూన్ 15 సామాజిక తెలంగాణ**

పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వీధుల్లో చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేడిగడ్డ తండా సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ లు సూచించారు. వర్షాల ప్రభావం వల్ల గ్రామంలో మురికినీరు చేరి రోగాల బారినపడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా సోమవారం మేడిగడ్డ తండాలో బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. అదేవిధంగా మంచినీటి సదుపాయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనారోగ్యం బారినపడకుండా, కలుషిత నీరు తాగకూడదని తెలియజేస్తూ, శుద్ధమైన మంచినీటిని అందజేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి వార్డు సభ్యులు సితి భాస్కర్, సిబ్బంది శాంతి, ధోలి గ్రామస్తులు రఘు, శ్రీను, మధు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో కీలక ముందడుగు




**షాద్‌నగర్, జూన్ 15 సామాజిక తెలంగాణ**

షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం అయిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం వేగవంతమైంది. తాగునీటి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే ఈ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్తో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆదిత్యనాథ్ దాస్ మాట్లాడుతూ, రిజర్వాయర్ నిర్మాణంలో భూసేకరణ అత్యంత కీలకమని, తక్షణమే ప్రక్రియను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ ప్రాజెక్టు ఇప్పటికే పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్నందున ప్రత్యేక జీవో అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్‌తో స్వయంగా మాట్లాడి భూసేకరణను వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ, “షాద్‌నగర్ ప్రజల తాగునీటి, సాగునీటి అవసరాలను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యం. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేస్తాం” అని తెలిపారు.ఈ సమావేశంలో ఏఎంసీ డైరెక్టర్ టి. కర్ణాకర్, తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్ధార్థ పాల్గొన్నారు .

# పెద్ది కలెక్షన్ల దూకుడు

## మొత్తం రూ.307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ వసూళ్ల పరంగా కూడా సత్తా చాటుతోంది. మొదటి వారం తర్వాత వీక్‌డేస్‌లో కొంత మందగించిన కలెక్షన్లు, రెండో వీకెండ్‌లో మళ్లీ ఊపందుకోవడం విశేషం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, విడుదలైన 11వ రోజు ఆదివారం 'పెద్ది' మరోసారి బలమైన ప్రదర్శన కనబరిచింది. దేశవ్యాప్తంగా సుమారు 4,133 షోల ద్వారా రూ. 9.20 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించినట్లు సమాచారం. దీంతో భారతీయ బాక్సాఫీస్ వద్ద 11 రోజుల్లో ఈ చిత్రం రూ. 216 కోట్ల నెట్, రూ. 256.23 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' మంచి స్పందనను అందుకుంటోంది. విదేశీ మార్కెట్లలో ఇప్పటివరకు సుమారు రూ. 51.75 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ రిపోర్ట్స్ చెబుతున్నాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం రూ. 307.98 కోట్ల గ్రాస్ కలెక్షన్లను తన ఖాతాలో వేసుకున్నట్లు సమాచారం. మరోవైపు చిత్ర బృందం మాత్రం మొత్తం వసూళ్లు రూ. 393 కోట్లకు చేరుకున్నాయని ప్రకటించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు రూ. 195.30 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదైనట్లు సమాచారం. ఇది సినిమా విజయానికి కీలకంగా మారిందని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు.

రెండో వీకెండ్‌లో కలెక్షన్లు మళ్లీ జోరందుకోవడంతో 'పెద్ది' మరిన్ని రికార్డుల దిశగా పయనిస్తోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఫుల్ రన్ ముగిసే నాటికి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.


# కరుప్ప విజయంతో మరింత బిజీగా త్రిష

## రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు టాక్



సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ బిజీ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్ప వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్ప చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడు తున్నాయి. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.

# కర్నూలులో నాగబంధం యూనిట్ సందడి




కర్నూలు నగరంలో నాగబంధం చిత్ర బృందం సందడి చేసింది. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అనంత పద్మనాభ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఈ సినిమా ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు పాల్గొన్నారు. సినిమా ప్రమోషన్‌ను కర్నూలు నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని సినీనటులు తెలిపారు. యువతకు పురాణ కథలు, దేవాలయాల గురించి సినిమాలో చూపించామన్నారు. జులై 3వ తేదీన ఈ చిత్రం విడుదలవుతుందని, అందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు వద్ద హీరోయిన్ డ్యాన్స్‌తో సందడి చేశారు.

# గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించా..

## హాట్ టాపిక్‌గా సమంత కామెంట్స్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత టైటిల్ రోల్‌లో నటిస్తున్నచిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తూ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది. ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సమంత తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.తాను గర్వంగా చెప్పుకోలేని ఎన్నో సినిమాల్లో నటించానంది సామ్. చాలా తక్కువ టైంలోనే ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు.. ఉత్సాహంగా నా పేరును కేకలు వేస్తూ పిలవడం, నా సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూడటం మొదలుపెట్టారు. ఇదంగా చూసి నేను ఆశ్చర్యపోయాను. ఆ స్టార్‌డమ్ అనే మాయలో మునిగిపోయానని చెప్పింది సమంత. అంతేకాదు మీడియా నా గురించి రాస్తోంది. ఏడాదికి నేను ఎన్ని సినిమాల్లో నటించాననే విషయాలపైనే ఎక్కువ ఆసక్తి చూపించేదానిని అంటూ చెప్పుకొచ్చింది. హిట్ సినిమాలు, బ్లాక్ బస్టర్ సినిమాలను అందిస్తున్నప్పటికీ తాను అసలు సినిమాకు ఏం ఇస్తున్నానని ఎప్పుడూ కూడా ఆలోచించలేదని చెప్పింది. ఈ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఓ వైపు గృహిణిగా, మరోవైపు వీరవనితలాగే ఉగ్రరూపం చూపిస్తూ సాగుతున్న ట్రైలర్ సినిమాలో సామ్‌ను సరికొత్తగా చూపించబోతున్నట్టు చెప్పకనే చెబుతోంది. పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనేది ఈ సినిమా కథ అని తెలుస్తుంది. ప్రముఖ దర్శకుడు సమంత భర్త రాజ్ నిడిమోర్ ఈ కథను రాయగా.. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ దీనిని నిర్మిస్తోంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు.



# సినిమాలు మానేసి హిమాలయాలకు వెళ్లిపోదాం అనుకున్నా ..

## నివేదా పేతురాజ్ ఎమోషనల్ కామెంట్స్

తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరోయిన్ నివేదా పేతురాజ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గత కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉన్న ఆమె, ఇటీవల జరిగిన 'సింగ్ గీతం' సక్సెస్ మీట్‌లో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టకాలం గురించి భావోద్వేగంగా మాట్లాడారు. 'సింగ్ గీతం' సక్సెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. 2023లో నేను సినిమాలు పూర్తిగా మానేయాలని అనుకున్నాను. నా జీవితం తప్పుడు దారుల్లో వెళ్తోందని, కొన్ని తప్పు నిర్ణయాలు తీసుకున్నానని అప్పట్లో అనిపించింది. ఆ సమయంలో నేను చాలా కన్ఫ్యూజన్‌లో ఉన్నాను అని వెల్లడించారు.కానీ ఇప్పుడు 'సింగ్ గీతం' సినిమాతో మళ్లీ జీవితంలో సరైన దారిలోకి వచ్చాను. ఈ సినిమా నాకు కొత్త జీవితాన్ని ఇచ్చింది. నాగ్ అశ్విన్ లేకపోతే ఈ రోజు నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. బహుశా హిమాలయాల్లో ధ్యానం చేసుకుంటూ ఉండేదాన్ని. ఈ సినిమా మంచి ఫలితం ఇస్తుందని నమ్మాను. సినిమా చూసిన తర్వాత నేను భావోద్వేగానికి లోనై ఏడ్చాను అని చెప్పారు. నివేదా చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ముఖ్యంగా తప్పు నిర్ణయాలు తీసుకున్నాను , "సినిమాలు మానేద్దాం అనుకున్నాను", "హిమాలయాలకు వెళ్లిపోదాం అనిపించింది" వంటి మాటలు ఆమె వ్యక్తిగత జీవితంలో జరిగిన పరిణామాల గురించేనా అనే సందేహాలను అభిమానుల్లో రేకెత్తిస్తున్నాయి. కొంతమంది నెటిజన్లు ఆమె విఫలమైన రిలేషన్‌షిప్‌ను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చని అభిప్రాయపడుతుండగా, మరికొందరు మాత్రం జీవితంలో ఎదురైన ఒత్తిళ్లు, కెరీర్ పరమైన నిరాశల గురించే మాట్లాడి ఉండొచ్చని చెబుతున్నారు. అయితే ఈ విషయంపై నివేదా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.ఏదేమైనా, ఒక దశలో సినిమాలకు గుడ్‌బై చెప్పాలనుకున్న నివేదా పేతురాజ్ ఇప్పుడు మళ్లీ సినిమాల్లో చురుకుగా కనిపించేందుకు సిద్ధమవుతుండటం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది. 'సింగ్ గీతం'తో ఆమెకు కొత్త ఆరంభం లభించిందని, ఇకపై మరిన్ని మంచి పాత్రల్లో ఆమెను చూడాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

Printed published owned by P Venkataramana H No 150/2 Road no 4 Midhani colony injapur abdullapur met mandal Rangareddy dist TS 501510. printed At Kiran< printers H No 150/2 Road No 4 abdullapur met mandal Rangareddy dist Ts 501510.published from Podila Publications editor P Venkataramana RNi No Aptel/ 20011/39851 mobile no 9133399979/7330899979 email. Samajikanews10@gmail.com